

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS


మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 16-05-2026 | సంపుటి - 27 | సంచిక -353 | రూ : 4 | పేజీలు: 8


## బండి సంజయ్ తక్షణమే కుమారుడిని అప్పగించాలి

- తప్పు చేస్తే ఎవరికీ మినహాయింపులు ఉండవు
- 2034 తరువాత జాతీయ రాజకీయాల్లోకి వెళ్తా
- అప్పటి వరకు తెలంగాణకు సీఎంగా ఇక్కడే ఉంటా
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్: 'కుమారుడి విషయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ తీరు నైతికంగా తప్పు. నేరారోపణలు రాగానే భారత హోంశాఖ సహాయ మంత్రి కుమారుడు పారిపోవడం సరికాదు. తనయుడి తప్పిదంతో ఆయనకు తలవంపులు వచ్చాయి. తక్షణమే అతడిని అప్పగించాలి. అతడు విచారణ ఎదుర్కొంటే సంజయ్ గౌరవం పెరుగుతుంది. లేదంటే గడువు ముగిసిన తరువాత పోలీసులు వారి పద్ధతిలో వ్యవహరిస్తారు. ఈ కేసులో బాధితులకు అండగా ఉంటాం' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఒక మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో

తరువాయి 2లో



## క్యాన్సర్ కట్టడికి ప్రత్యేక ఆసుపత్రులు



- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- క్యాన్సర్‌పై డాక్టర్ నోరి దత్తాత్రేయుడు రూపొందించిన పటం విడుదల

హైదరాబాద్: రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధిని కట్టడి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని, ఈ క్రమంలో జబ్బు తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక క్యాన్సర్ ఆసుపత్రులను ఏర్పాటుచేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ క్యాన్సర్ వైద్యనిపుణుడు నోరి దత్తాత్రేయుడు రూపొందించిన క్యాన్సర్ పటా(అట్లాస్)న్ని శుక్రవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి సీఎం విడుదల చేశారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. "క్యాన్సర్‌పై పోరాటంలో నోరి దత్తాత్రేయుడు రూపొందించిన ఈ అట్లాస్ ఎంతో ఉపయోగకరం. రాష్ట్రంలో క్యాన్సర్‌ను కట్టడి చేసేందుకు ఇది ఉపయుక్తంగా ఉంటుంది. జబ్బు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, వాటి కారణాలను అన్వేషించే అవకాశం దీనిద్వారా లభిస్తుంది. ఈ గణాంకాల ఆధారంగా వ్యాధి తీవ్రత

తరువాయి 2లో

## అంతర్జాతీయ పారిశ్రామిక కారిడార్‌గా తెలంగాణ

- మంత్రి శ్రీధర్‌బాబు
- సంగారెడ్డి జిల్లాలో కేజేఎస్ పరిశ్రమ యూనిట్-2కు శంకుస్థాపన

కొండాపూర్ : అంతర్జాతీయ పారిశ్రామిక కారిడార్ దిశగా తెలంగాణ పయనిస్తోందని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం తొగర్‌పల్లి, అలియాబాద్ గ్రామాల శివారులో రూ.650 కోట్ల పెట్టుబడితో 44

తరువాయి 2లో




## అందాల దారిలో హైస్పీడ్ రైలు..!



- నల్లమల మీదుగా ఎలైన్‌మెంట్
- హైదరాబాద్-బెంగళూరు ప్రాజెక్టు సర్వే కొలిక్కి..

2లో



## ముందస్తు బెయిలుపై ఈ దశలో ఉత్తర్వులివ్వలేం

- బండి భగీరథ్ కేసులో హైకోర్టు స్పష్టీకరణ
- అరెస్ట్ నుంచి రక్షణకు పదే పదే

2లో


## మోడీ సర్కార్ వైఫల్యానికి ప్రజలు బలి

- పశ్చిమాసియా ఉద్రిక్తతలను కారణంగా చూపుతున్న కేంద్రం
- చమురు ధరల భారమంతా సాధారణ ప్రజల పైనే
- రవాణా నుంచి కూరగాయల వరకు అన్ని ధరలకూ రెక్కలు!పశ్చిమాసియా ఉద్రిక్తతలను కారణంగా చూపుతున్న కేంద్రం
- దేశంలో ద్రవ్యోల్బణం మరింత పెరిగే ప్రమాదం : ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు
- పశ్చిమాసియా ఉద్రిక్తతలను కారణంగా చూపుతున్న కేంద్రం



2లో

## 26న కేరళంకు నైరుతి పవనాలు



- నాలుగు రోజుల ముందే వచ్చే అవకాశం
- త్వరలో తీవ్రమైన ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం ..ఐఎండీ

2లో



## నాంపల్లి రైల్వే స్టేషన్ లో అగ్నిప్రమాదం..

- నాంపల్లి రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న రైలులో అగ్నిప్రమాదం
- హైదరాబాద్‌జైపూర్ స్పెషల్ ట్రైన్‌లోని రెండు ఏసీ బోగీలు దగ్ధం
- ప్రయాణికులు లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం
- ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తుకు ఆదేశించిన దక్షిణ మధ్య రైల్వే

2లో

# ముందస్తు బెయిలుపై ఈ దశలో ఉత్తర్వులివ్వలేం

హైదరాబాద్: కేంద్ర మంత్రి, భాజపా నేత బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పేట్‌బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో ఈ దశలో ముందస్తు బెయిల్‌పై ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు తేల్చి చెప్పింది. ఈలోపు అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులిచ్చే అంశంపై నిర్ణయాన్ని వచ్చే వారం వెలువరిస్తామంది. పోక్సో కేసులో ముందస్తు బెయిలు మంజూరు చేయాలంటూ బండి భగీరథ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ టి.మాధవీదేవి శుక్రవారం రాత్రి 9 గంటల నుంచి దాదాపు అర్ధరాత్రి 12 గంటల వరకు సుదీర్ఘ విచారణ చేపట్టారు. ఇరుపక్షాల న్యాయవాదుల వాదనలు విన్న అనంతరం.. బాలిక వాంగ్మూలం పరిశీలించిన తర్వాత ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని న్యాయమూర్తి స్పష్టం చేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది జోక్యం చేసుకుంటూ.. అప్పటివరకైనా పిటిషనర్‌పై ఎలాంటి చర్య తీసుకోకుండా రక్షణ కల్పించాలని, దర్యాప్తునకు సహకరిస్తామని, కనీసం యథాతథస్థితినైనా కొనసాగించేలా ఉత్తర్వులివ్వాలంటూ పదే పదే అభ్యర్థించారు. న్యాయమూర్తి అందుకు నిరాకరించారు. వచ్చే వారం దాకా ఆగకుండా వీలైనంత త్వరగా ఇవ్వాలన్న పిటిషనర్ న్యాయవాది అభ్యర్థనపై పరిశీలిస్తామంటూ న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు.

*** ఫిర్యాదులో పొంతనలేని అంశాలు: పిటిషనర్ న్యాయవాది ఎస్. నిరంజన్‌రెడ్డి**

ఎఫ్ఐఆర్ నమోదు చేసినపుడు పెట్టిన సెక్షన్‌ల ప్రకారం అరెస్ట్ అవసరంలేదని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి అన్నారు. 'పోలీసులు పిటిషనర్‌ను ఇరికించాలన్న ఉద్దేశంతో కఠిన సెక్షన్‌లను చేర్చారు. డిసెంబరులో సంఘటన జరిగితే ఫిర్యాదుదారు మార్చిలో న్యాయపరమైన చర్చలు జరిపిన తర్వాత మే 8న ఫిర్యాదు చేశారు. ఇప్పటికిప్పుడు జరిగిన సంఘటన కాదు. అలాంటప్పుడు వెంటనే సెక్షన్‌లను మార్చాల్సిన అవసరంలేదు. బాధితురాలి పుట్టిన తేదీలను రెండుగా చూపుతూ దానికి సంబంధించిన పత్రాలను సీల్డ్ కవర్‌లో సమర్పించాం. అలాగే ఫిర్యాదులో పేర్కొన్న మూడు సంఘటనలు బాలిక ఆమోదం ప్రకారమే జరిగాయి. వారు తల్లిదండ్రుల అనుమతితోనే బయటికి వెళ్లారు. వారు రిలేషన్‌షిప్‌లో ఉన్నారు. జనవరి 7న రిలేషన్‌షిప్ నుంచి పిటిషనర్ బయటికి రావడంతో కేసులు తెరపైకి వచ్చాయి. ఫిర్యాదులో పేర్కొన్న సంఘటనల తర్వాత కూడా బాలిక, పిటిషనర్ గంటల తరబడి మాట్లాడుకున్నారు. బలవంతంగా మద్యం తాగించారంటూ ఫిర్యాదులో పేర్కొనగా వీడియోలు చూస్తే బాలిక ఇష్టంగా తీసుకున్నట్లు ఆధారాలున్నాయి' అని వాదించారు.

# అందాల దారిలో హైస్పీడ్ రైలు..!

హైదరాబాద్: హైదరాబాద్ బెంగళూరు మహానగరాలను అత్యాధునిక రవాణా వ్యవస్థతో అనుసంధానించేందుకు ప్రతిపాదించిన హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టుకు సంబంధించిన సర్వే కొలిక్కి వస్తోంది. ఈ ప్రతిష్ఠాత్మక మార్గం కోకాపేటలో మొదలై శంషాబాద్ మీదుగా నల్లమల అటవీ ప్రాంతాన్ని తాకుతూ.. ప్రకృతి సోయగాలకు ప్రతీకలైన మన్ననూరు, సోమశిల ప్రాంతాల మీదుగా వెళ్లేలా ప్రాథమిక ఎలైన్‌మెంట్‌ను గుర్తించారు. హైదరాబాద్ నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మూడు హైస్పీడ్ (బుల్లెట్) రైలు కారిడార్లలో హైదరాబాద్ బెంగళూరు మార్గం ఒకటి. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో వీటిని ప్రకటించిన విషయం తెలిసిందే. హైదరాబాద్ బెంగళూరు ప్రాజెక్టు తెలంగాణలో మొదలై ఏపీ మీదుగా సాగుతూ కర్ణాటకలో ముగుస్తుంది. ఈ కారిడార్ రాష్ట్రంలో 205 కిలోమీటర్ల దూరం ఉంటుంది.

*** ప్రభుత్వం సూచించిన మార్గం వైపు మొగ్గు**

హైదరాబాద్ బెంగళూరు హైస్పీడ్ రైలు కారిడార్‌ను నేషనల్ హైస్పీడ్ రైల్ కారిడార్ లిమిటెడ్ (ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్) తొలుత శంషాబాద్, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్, కర్నూలు మీదుగా ప్రతిపాదించింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం శంషాబాద్, మన్ననూరు శ్రీశైలం మార్గంలో చేపట్టాలని సూచించింది. మహబూబ్‌నగర్ వైపు ఇప్పటికే రైలు మార్గం ఉన్నందున హైస్పీడ్ కారిడార్‌ను రైల్వే నెట్‌వర్క్ లేని మార్గంలో చేపట్టాలంది. ఈ నేపథ్యంలో ప్రాథమిక ఎలైన్‌మెంట్ సర్వేలో మార్పులు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లుగా శంషాబాద్, మన్ననూరు మార్గం వైపు ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్ మొగ్గు చూపింది. మన్ననూరు తర్వాత సోమశిలవైపు ఎలైన్‌మెంట్ రూపొందించారు. తర్వాత కర్నూలుకు ఈ మార్గం కలుస్తుంది. మన్ననూరు నుంచి శ్రీశైలం వరకు టైగర్ రిజర్వు ప్రాంతం పరిధిలోకి వస్తుంది. ఈ మార్గం కూడా ఘాట్ రోడ్డులో ఉంది. సర్వే ప్రక్రియ పూర్తయ్యాక సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించాల్సి ఉంటుంది. ప్రాథమిక సర్వేలోని అంశాలకు డీపీఆర్‌లో మార్పులు చేర్పులు జరిగే అవకాశం ఉంటుంది. కోకాపేట నుంచి శంషాబాద్ వరకు ఎలైన్‌మెంట్‌లో రెండు ఆప్షన్లను పరిశీలిస్తున్నారు. మొదటిది ఓఆర్‌ఆర్ మీదుగా, రెండోది ఔటర్ వెలుపల నుంచి ప్రతిపాదించారు.

**హైస్పీడ్ స్టేషన్లు ఇవే**

హైదరాబాద్‌బెంగళూరు హైస్పీడ్ రైలు కారిడార్ మార్గంలో ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్ సర్వే చేస్తోంది. తెలంగాణలో మొత్తం ఐదు చోట్ల స్టేషన్లను నిర్మించాలని ప్రతిపాదించింది. అవి శంషాబాద్, భారత్ ఫ్యూచర్ సిటీ, ఆమనగల్లు, మన్ననూరు, సోమశిల.

# బండి సంజయ్ తక్షణమే కుమారుడిని అప్పగించాలి

హైదరాబాద్: 'కుమారుడి విషయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ తీరు నైతికంగా తప్పు. నేరారోపణలు రాగానే భారత హోంశాఖ సహాయ మంత్రి కుమారుడు పారిపోవడం సరికాదు. తనయుడి తప్పిదంతో ఆయనకు తలవంపులు వచ్చాయి. తక్షణమే అతడిని అప్పగించాలి. అతడు విచారణ ఎదుర్కొంటే సంజయ్ గౌరవం పెరుగుతుంది. లేదంటే గడువు ముగిసిన తరువాత పోలీసులు వారి పద్ధతిలో వ్యవహరిస్తారు. ఈ కేసులో బాధితులకు అండగా ఉంటాం' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఒక మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాను 2034 వరకు తెలంగాణకు ముఖ్యమంత్రిగా ఉంటానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రెండోసారి కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. 2034 తరువాత దేశ రాజకీయాల్లోకి వెళ్తానని వెల్లడించారు. మూడోసారి కాంగ్రెస్‌కు అధికారం తీసుకువస్తానని, అయితే అధికారాన్ని తదుపరి తరానికి అప్పగిస్తానన్నారు. తప్పు చేస్తే ఎవరికీ మినహాయింపులు ఉండవని, చట్టప్రకారం ముందుకు వెళ్తామని వెల్లడించారు.

**మోదీ మాటల్లో వేరే అర్థాలేమీ లేవు**

''నా జీవితంలో ఇప్పటివరకు సాధించిన విజయంపై సంతృప్తిగా ఉన్నా. అధికారంలో ఉన్నప్పుడు చేసిన కార్యక్రమాల గురించి భావితరాలు తెలుసుకుని, మాట్లాడుకోవాలన్నదే లక్ష్యం. అందుకే ఫ్యూచర్‌సిటీకి అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నా. 2034 వరకు ఇక్కడే ఉంటూ తెలంగాణ ప్రజల కోసం పనిచేస్తా. ఆ తరువాత రాహుల్‌గాంధీ ప్రధానిగా దేశ రాజకీయాల్లో ఏ కుర్చీలో కూర్చోబెడితే అక్కడే కూర్చుంటా. హైదరాబాద్ పర్యటనలో పీఎం మోదీ మాట్లాడిన మాటల్లో వేరే అర్థాలేమీ లేవు. కలిసి పనిచేయాలని కోరారు. ఒకవేళ తప్పుగా ఎవరైనా అనుకుంటే మంచిదే. రేవంత్‌రెడ్డికి ఈ దేశంలో డిమాండ్ ఉందని అందరికీ అర్థమవుతుంది. నేను రాహుల్‌గాంధీ సూచనల మేరకు ఇక్కడ పనిచేస్తున్నా.

*** సంజయ్ బావమరిది ఇంటికి, దిల్లీకి ఐదు పోలీసు బృందాలను పంపాం**

''8వ తేదీన బాధితురాలి తల్లి పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మైనర్ కావడంతో బాధితురాలి స్టేట్‌మెంట్ తీసుకుని, మరుసటి రోజు ఎఫ్ఐఆర్ నమోదు చేశాం. ఎక్కడా జాప్యం లేదు. బాధితురాలి తల్లికన్నా రెండు గంటల ముందు.. బండి సంజయ్ తనయుడు హనీట్రాప్ అని ఫిర్యాదు చేశారు. ఈ రెండు ఫిర్యాదులు ప్రధాని పర్యటనకు ముందు వచ్చాయి. బాధితురాలి స్టేట్‌మెంట్ తీసుకుని తొమ్మిదిన నోటీసులు ఇచ్చేసరికి ఆయన కుమారుడు పారిపోయాడు. నిబంధనల ప్రకారం స్టేట్‌మెంట్ తీసుకోకుండా పోలీసులతో వెళ్తే.. వెయ్యి మంది పోలీసులతో దాడులు చేశారని, రాజకీయ వివక్ష అని అనేవారు. మా ప్రభుత్వంలో రాజకీయ నాయకులు, సినిమా వాళ్లకు ఎవరికీ మినహాయింపులు లేవు. ఈనెల 10న ప్రధాని పర్యటన కోసం 9వేల మంది పోలీసులతో భద్రత కల్పించాం. పోలీసు వ్యవస్థ మొత్తం నాలుగు రోజులు అక్కడే ఉంది. హైదరాబాద్ అత్యంత సున్నితమైన నగరం. దేశంలో ఎక్కడ ఐఎస్ఐ దాడులు జరిగినా.. మూలాలు హైదరాబాద్‌లో ఉంటాయి. ప్రధాని పర్యటన ముగిశాక ఈనెల 11న ఈ కేసుపై ప్రత్యేకంగా సమీక్ష చేసి, సీనియర్ ఐపీఎస్ అధికారికి బాధ్యత అప్పగించాం. బండి సంజయ్ బావమరిది ఇంటికి, దిల్లీకి ఐదు పోలీసు బృందాలను పంపించాం.

*** కుమారుడు నేరం చేస్తే తండ్రిని అరెస్టు చేస్తారా?**

కొందరు చర్యలు తీసుకోవట్లేదు.. చర్యలు తీసుకోవట్లేదు అంటున్నారు. కుమారుడు నేరం చేస్తే తండ్రిని అరెస్టు చేస్తారా? ఇది పిల్లల భవిష్యత్తుకు సంబంధించినది. ఆచితూచి వ్యవహరిస్తున్నాం. వచ్చిన ఫిర్యాదు 2025 డిసెంబరు 31కి ముందు.. అంటే నాలుగైదు నెలల క్రితం జరిగిన సంఘటనలపై వచ్చింది. ఈ విషయంలో ఆధారాలు సేకరించాలి. బాధితురాలు మేజర్ అని, 2 బర్త్ సర్టిఫికెట్లు ఉన్నాయని అంటున్నారు. విచారణలో పాఠశాలకు వెళ్లి వివరాలు, ఆస్పత్రి నుంచి పుట్టిన వివరాలు, ఆధార్ తీసుకునేందుకు పోలీసులకు 24 గంటల సమయం పడుతుంది. ఇవేమీ తీసుకోకుండా ముందుకు వెళ్లే బండి సంజయ్‌ను రాజకీయంగా ఎదుర్కొనలేక రాజకీయాలు చేస్తున్నామని అంటారు. ఎవరిపైనా కక్షపూరితంగా వ్యవహరించడం లేదు. నన్ను జైల్లో పెట్టిన కేసీఆర్ కుటుంబంపై కక్షతో వ్యవహరిస్తున్నానా? బండి సంజయ్‌కు, భారాసకు ఎక్కడ తేడా వచ్చిందో తెలియదు. నాడు భారాసపై కొట్లాడతానన్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్.. ఇప్పుడు ఆ పార్టీలో చేరి వారి సేవలో తరిస్తున్నారు. కేటీఆర్, బండి సంజయ్, ప్రవీణ్‌కుమార్‌కు పంచాయితీ ఉండొచ్చు. కేటీఆర్‌పై కేసులు ఉంటే.. ఏసీబీ ద్వారా నోటీసులు ఇచ్చి విచారిస్తాం. భారాసను భాజపాలో విలీనం చేయాలనే అంశాన్ని బండి సంజయ్ వ్యతిరేకించారని వారికి కోపం ఉన్నట్లు ఉంది. కానీ నేను ప్రభుత్వాన్ని నడుపుతున్నా.. సత్రం నడపడం లేదు'' అని అన్నారు.

# క్యాన్సర్ కట్టడికి ప్రత్యేక ఆసుపత్రులు

హైదరాబాద్: రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధిని కట్టడి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించిందని, ఈ క్రమంలో జబ్బు తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక క్యాన్సర్ ఆసుపత్రులను ఏర్పాటుచేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ క్యాన్సర్ వైద్యనిపుణుడు నోరి దత్తాత్రేయుడు రూపొందించిన క్యాన్సర్ పటా(అట్లాస్)న్ని శుక్రవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి సీఎం విడుదల చేశారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. ''క్యాన్సర్‌పై పోరాటంలో నోరి దత్తాత్రేయుడు రూపొందించిన ఈ అట్లాస్ ఎంతో ఉపయోగకరం. రాష్ట్రంలో క్యాన్సర్‌ను కట్టడి చేసేందుకు ఇది ఉపయుక్తంగా ఉంటుంది. జబ్బు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, వాటి కారణాలను అన్వేషించే అవకాశం దీనిద్వారా లభిస్తుంది. ఈ గణాంకాల ఆధారంగా వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేకంగా రోగ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు అవకాశం ఉంది. హైదరాబాద్‌కే పరిమితం కాకుండా, బాధితులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో కూడా ప్రత్యేక ఆసుపత్రులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్సను మరింత సమర్థంగా అందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ కృషి చేయాలి'' అని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, సీఎంవో ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా, ఆరోగ్యశ్రీ సీఈవో హనుమంతు కె.జెండగె పాల్గొన్నారు.

# అంతర్జాతీయ పారిశ్రామిక కారిడార్‌గా తెలంగాణ

కొండాపూర్: అంతర్జాతీయ పారిశ్రామిక కారిడార్ దిశగా తెలంగాణ పయనిస్తోందని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం తొగర్‌పల్లి, అలియాబాద్ గ్రామాల శివారులో రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న కేజేఎస్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ యూనిట్ 2కు శుక్రవారం మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ. 'ఈ పరిశ్రమ ఏర్పాటుతో ప్రత్యక్షంగా 1,550 మందికి ఉపాధి అవకాశాలు దక్కుతాయి. మేడ్ ఇన్ తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేసేందుకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడనుంది. పరిశ్రమల ఏర్పాటుకు భూములిస్తూ రైతులు దేశాభివృద్ధిలో భాగస్వాములవుతున్నారు. పంట ఉత్పత్తుల మార్కెటింగ్‌కు విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు లక్ష్యంగా మా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో భూములు గుర్తించి వదిలేశారు. మా ప్రభుత్వం అవసరమైన అన్ని అనుమతులు మంజూరు చేస్తూ పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తోంది' అని తెలిపారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి ప్రభుత్వం అన్నివిధాలుగా సహకరిస్తుందని తెలిపారు.

# నాంపల్లి రైల్వే స్టేషన్ లో అగ్నిప్రమాదం.. ఏసీ బోగీలో మంటలు

హైదరాబాద్ నాంపల్లి రైల్వే స్టేషన్‌లో నిన్న సాయంత్రం పెను ప్రమాదం తప్పింది. ప్లాట్‌ఫామ్‌పై ఆగి ఉన్న హైదరాబాద్‌జైపూర్ స్పెషల్ ట్రైన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కలకలం రేగింది. ప్రయాణికులు ఎక్కకముందే ఈ ఘటన జరగడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళ్తే, రాత్రి 7:50 గంటలకు జైపూర్ బయలుదేరాల్సిన స్పెషల్ రైలును ప్లాట్‌ఫామ్ 4 పైకి తీసుకొస్తున్న సమయంలో, సాయంత్రం 6:30 గంటల ప్రాంతంలో B1, B2 ఏసీ కోచ్‌ల నుంచి దట్టమైన పొగ, మంటలు వచ్చాయి. ఆ సమయంలో బోగీలు ఖాళీగా ఉండటంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. రైల్వే సిబ్బంది వెంటనే స్పందించి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. మూడు ఫైర్ ఇంజిన్లతో ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ముందుజాగ్రత్త చర్యగా మంటలు వ్యాపించిన రెండు కోచ్‌లను రైలు నుంచి వేరు చేశారు. ఈ ప్రమాదం కారణంగా హైదరాబాద్‌జైపూర్ రైలును నాలుగున్నర గంటలు ఆలస్యంగా రీషెడ్యూల్ చేసి పంపించారు. ఘటన వల్ల ఇతర రైళ్ల రాకపోకలకు పెద్దగా అంతరాయం కలగలేదని అధికారులు తెలిపారు.

# మోడీ సర్కార్ వైఫల్యానికి ప్రజలు బలి

న్యూఢిల్లీ : దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ పెరిగాయి. సామాన్య ప్రజలపై ఆర్థిక భారం మరింత పెరిగింది. దాదాపు నాలుగేండ్ల తర్వాత ప్రభుత్వరంగ చమురు సంస్థలు లీటరుకు సుమారు రూ.3 చొప్పున ధరలు పెంచాయి. దీంతో ఢిల్లీలో పెట్రోల్ ధర రూ.97.77కు చేరింది. డీజిల్ ధర రూ.90.67కు ఎగబాకింది. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ ముడి చమురు ధరల పెరుగుదల కారణమని కేంద్రం చెప్తున్నప్పటికీ.. ఈ భారాన్ని పూర్తిగా ప్రజల పైనే మోపుతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

*** ప్రజలకు ఇంధన పొదుపు సందేశం.. ఉపశమన చర్యలు శూన్యం**

ప్రధాని మోడీ ఇటీవల ఇంధన వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు సూచించిన విషయం విదితమే. ఇది జరిగిన కొన్ని రోజులకే కేంద్రం ప్రజలపై పెట్రో వడ్డన షురూ చేయడం గమనార్హం. అయితే ఇంధన ధరలను నియంత్రించేందుకు కేంద్రం ఎలాంటి ప్రత్యక్ష ఉపశమన చర్యలూ తీసుకోకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. అంతర్జాతీయ పరిస్థితులను కారణంగా చూపిస్తూ కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పించుకుంటోందని ప్రతిపక్షాలు, సాధారణ ప్రజలు విమర్శిస్తున్నారు.

*** న్యూఢిల్లీరవాణా ఖర్చులు భారీగా పెరిగే అవకాశం**

దేశంలో పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల ప్రభావం ముందుగా రవాణా రంగంపై పడనుంది. కార్లు, బైకులు వినియోగించే వారి రోజువారీ ప్రయాణ ఖర్చులు పెరగనుండగా.. డీజిల్‌పై ఆధారపడే బస్సులు, లారీలు, సరుకు రవాణా వ్యవస్థలకు అదనపు భారం పడుతుందని విశ్లేషకులు చెప్తున్నారు. దీని ప్రభావంతో ఆటో, క్యాబ్ ఛార్జీలు, సరుకు రవాణా ధరలు పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

**వంటింటిపై కూడా మంట**

భారత్‌లో ఎక్కువ శాతం ఆహార సరఫరా రోడ్డు రవాణా పైనే ఆధారపడుతుంది. డీజిల్ ధరలు పెరగడంతో కూరగాయలు, పండ్లు, పాలు, ధాన్యాలు, ప్యాకేజ్డ్ వస్తువుల రవాణా ఖర్చులు పెరుగుతాయని నిపుణులు చెప్తున్నారు. చివరకి ఈ భారం వినయోగదారుల పైనే పడుతుందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే అమూల్, మదర్ డైరీ పాలు లీటరుకు రూ.2 పెంచడం దీనికి ఉదాహరణగా చెప్తున్నారు. ఇక ఇంధన ధరలు ఇలాగే దీర్ఘకాలం పాటు అధిక స్థాయిలో కొనసాగితే.. ఆహార ద్రవ్యోల్బణం కూడా మరింత తీవ్రం అయ్యే అవకాశం ఉందని అంటున్నారు.

*** ఆన్‌లైన్ డెలివరీలు, ఈ-కామర్స్ సేవలపై ప్రభావం**

ఇంధన ధరల పెరుగుదలతో ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ, గ్రాసరీ, కొరియర్, ఈ కామర్స్ సంస్థల రవాణా వ్యయాలు పెరగనున్నాయి. దీంతో డెలివరీ ఛార్జీలు పెరగడం, డిస్కౌంట్లు తగ్గించడం, కనీస ఆర్డర్ విలువలను పెంచడం వంటి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని విశ్లేషకులు వివరిస్తున్నారు.

*** గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం**

ఇంధన ధరల పెరుగుదల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పైనా తీవ్ర ప్రభావాన్ని చూపనున్నాయి. డీజిల్‌పై ఆధారపడే ట్రాక్టర్లు, నీటి మోటార్లు, వ్యవసాయ రవాణా వాహనాల ఖర్చులు పెరగనున్నాయి. దీంతో రైతులపై అదనపు భారం పడనుంది. వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు పెరిగితే ఆ ప్రభావం తిరిగి ఆహార ధరల రూపంలో ప్రజల పైనే పడుతుందని ఆర్థిక నిపుణులు, విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

**ద్రవ్యోల్బణం మరింత పెరిగే ప్రమాదం**

చమురు ధరల పెరుగుదల ప్రభావం దాదాపు అన్ని రంగాల పైనా ఉంటుంది. తయారీ, రిటైల్, వ్యవసాయం, సేవారంగం... ఇలా ప్రతి చోటా ఖర్చులు పెరుగుతాయి. దీంతో దేశంలో ద్రవ్యోల్బణం మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే టోకు ద్రవ్యోల్బణం పెరుగుతుండగా, ఇంధన ధరల పెంపు పరిస్థితిని మరింత దిగజార్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# 26న కేరళంకు నైరుతి పవనాలు

న్యూఢిల్లీ: ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు చల్లని కబురు అందించింది భారత వాతావరణ శాఖ(ఐఎండీ) . నైరుతి రుతుపవనాలు మే 26న కేరళలో ప్రవేశించే అవకాశం ఉందని అంచనా వేసింది. మే 26న రుతుపవనాలు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా దీనికి నాలుగు రోజుల అటు ఇటుగా అంటే మే 22 నుంచి మే 30 మధ్య రుతుపవనాలు తాకే అవకాశం ఉండవచ్చని ఐఎండీ వివరించింది. సాధారణంగా కేరళలో రుతుపవనాలు జూన్ 1 నాటికి ప్రవేశిస్తాయి. అక్కడి నుంచి ఉత్తరం వైపునకు విస్తరిస్తూ దేశంలోని మిగిలిన ప్రాంతాలకు చేరతాయి. కేరళలో రుతుపవనాల ప్రవేశం ద్వారా దేశంలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కొనసాగే వర్షాకాలం అధికారికంగా ప్రారంభమవుతుంది. రుతుపవనాల రాకపై స్పష్టత రావడంతో దేశవ్యాప్తంగా అన్నదాతలు ఖరీఫ్ సాగు పనులకు సిద్ధమవుతున్నారు. కాగా, గతేడాది రుతుపవనాలు మే 24న ప్రవేశించినట్టు ఆ శాఖ వెల్లడించింది.

**తీవ్రమైన ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం**

రాబోయే 24 గంటల్లో దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవుల ప్రాంతాల్లోకి రుతుపవనాలు విస్తరించడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని కూడా వాతావరణ శాఖ తెలిపింది. "భారత ప్రధాన భూభాగంలోకి నైరుతి రుతుపవనాల విస్తరణ అనేది కేరళలో వాటి ఆగమనంతో గుర్తిస్తాం. వేడి, పొడి వాతావరణం నుంచి వర్షాకాలంలోకి జరిగే మార్పును సూచించే ఒక ముఖ్యమైన సూచిక ఇది. రుతుపవనాలు ఉత్తరం వైపుగా విస్తరిస్తున్న కొద్దీ, ఆయా ప్రాంతాల్లో వేసవిలో ఉండే తీవ్రమైన ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం లభిస్తుంది." అని ఐఎండీ పేర్కొంది.

*** సాధారణ స్థాయి కంటే తక్కువ వర్షపాతం**

ఈ ఏడాది రుతుపవన కాలంలో భారతదేశంలో సాధారణ స్థాయి కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. దేశంలో తక్కువ వర్షపాతానికి కారణమయ్యే 'ఎల్ నినో' పరిస్థితులు ఏర్పడటమే దీనికి కారణం కావచ్చని ఐఎండీ అభిప్రాయపడింది. రుతుపవన కాలాల్లో దేశంలో సాధారణంగా సుమారు 80 సెం.మీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంటుంది. కాగా, ఈ రుతుపవన కాలానికి సంబంధించిన దీర్ఘకాలిక సగటు (1971 2020 మధ్య కాలం) 87 సెం.మీగా ఉంది. దేశ వ్యవసాయ ఆధారిత ఆర్థికవ్యవస్థకు జీవనాడిగా నైరుతి రుతుపవనాలను పిలుస్తారు.

# ఐస్ తయారీ యూనిట్లపై ఆకస్మిక తనిఖీలు

* నిబంధనలు పాటించని నిర్వాహకులకు ఆహార భద్రత అధికారుల హెచ్చరిక





నల్లగొండ, మే 15, ప్రజాస్ఫూర్తి. : నల్లగొండ జిల్లాలో వేసవి కాలంలో ఐస్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో, జిల్లా ఆహార భద్రత అధికారి ఎన్. శివ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని ఐస్ తయారీ యూనిట్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్లలో పరిశుభ్రత, శానిటరీ పరిస్థితులు, ఆహార భద్రత ప్రమాణాలు తదితర అంశాలను పరిశీలించారు. తనిఖీల్లో పలు యూనిట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ చట్టం-2006 ప్రకారం అవసరమైన ఆహార లైసెన్స్ లేకుండానే కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఐస్‌ను నేరుగా ఆహార పదార్థంగా ఉపయోగించకపోయినా, చేపలు, పండ్లు, మాంసం వంటి ఆహార పదార్థాలతో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సంబంధం ఉండేందున ఆహార భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అలాగే బాహ్య వినియోగం కోసం మాత్రమే అనే బోర్డులు ప్రదర్శించకపోవడం, ఆర్వో ప్లాంట్లలో యూవీ ట్రీట్‌మెంట్ వ్యవస్థ లేకపోవడం, ఆర్వో నీటి నిర్వహణ రిజిస్టర్లు, ఐస్ సరఫరా వివరాలు, ఉత్పత్తి రికార్డులు నిర్వహించకపోవడం గుర్తించారు. నీటి నాణ్యత పరీక్ష నివేదికలు, మైక్రోబయోలాజికల్ టెస్ట్ రిపోర్టులు కూడా చూపించలేకపోయినట్లు తెలిపారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ చట్టం-2006 ప్రకారం నిర్దిష్ట కాల వ్యవధిలో మైక్రోబయోలాజికల్ పరీక్షలు నిర్వహించడం తప్పనిసరి అని అధికారులు సూచించారు. భవిష్యత్తులో నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ప్రకాశం బజార్‌లోని సఫా చికెన్ సెంటర్ నుండి ఈచూరి గార్డెన్ ఫంక్షన్ హాల్‌కు ఎలాంటి పత్రాలు లేకుండా ఆటోలో తరలిస్తున్న సుమారు 200కిలోల చికెన్‌ను అధికారులు అడ్డుకుని తనిఖీ చేశారు. అనంతరం అది ఫంక్షన్ హాల్‌కు తరలిస్తున్నట్లు నిర్ధారణ కావడంతో నిర్వాహకులకు అవగాహన కల్పించి వదిలివేశారు. ఇకముందు ఫుడ్ లైసెన్స్, సంబంధిత పత్రాలతోనే మాంసం రవాణా చేయాలని సూచించారు.

# బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ లో ప్రవేశాల కు దరఖాస్తుల ఆహ్వానం

: జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి

జనగామ, ప్రజాస్ఫూర్తి: జిల్లా లోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థిని, విద్యార్థుల కోసం 2026-2027విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద 1వ తరగతి మరియు 5వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వా నిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి విక్రమ్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. మే 15వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారం భమై, 6జూన్ 2026వరకు కొనసాగుతుందని పేర్కొ న్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకో వాలని సూచించారు. జిల్లాలో ఎంపిక చేసిన బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో స్టేషన్ ఘనపూర్ మండలం లోని శివునిపల్లి గ్రామం లోని సెయింట్ థామస్ పాఠశాల, పాలకుర్తి లోని సిద్ధార్థ విద్యాలయం, కడవెండి లోని జాన్ బ్రిటో హై స్కూల్, నిడిగొండ లోని సెయింట్ పీటర్ ఫౌండేషన్ హై స్కూల్ లు ఉన్నాయని తెలిపారు. వీటిలో కొన్ని పాఠశాల ల్లో డే స్కాలర్ తో పాటు రెసిడెన్షి యల్ సదుపాయం కూడా అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ పథకానికి ఒక కుటుంబం నుంచి ఒక విద్యార్థి మాత్రమే అర్హుడని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన కుటుంబాల వార్షిక ఆదాయం రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతా ల వారికి రూ.2లక్షలు మించ రాదని వెల్లడించారు. 1వ తరగతి లో ప్రవేశం పొందేందుకు విద్యా ర్థులు 01-06-2020నుంచి 31-05-2021 మధ్య జన్మించి ఉండాలి. 5వ తరగతికి 01-06-2016నుంచి 31-05-2017మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు. దరఖాస్తుతో పాటు పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు లేదా ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులు, కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ కలర్ ఫోటోలు, గత విద్యా సంవత్సర మార్కుల మెమో జిరాక్స్ ప్రతు లు జత చేయాలని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయం, ఫస్ట్ ఫ్లోర్ ఎఫ్ 25, కలెక్టరేట్, జనగామలో దరఖాస్తు ఫారాలు పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 6, 2026సాయంత్రం 4గంటల లోపు కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

# నీట్ ప్రశ్నపత్రం లీకేజీ పై యూత్ కాంగ్రెస్ ధర్నా



ప్రజాస్ఫూర్తి, మెదక్: మెదక్ పట్టణంలో గల టీఎన్జీవో భవన్ లో శుక్రవారం మెదక్ నియోజకవర్గం ఎగ్జిక్యూటివ్ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పరశురామ్ గౌడ్ మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు అందరు కూడా పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. కష్టపడే ప్రతి ఒక్కరినీ కాంగ్రెస్ పార్టీ కాపాడుతుందని తొందరలోనే యూత్ కాంగ్రెస్ జిల్లా ,అసెంబ్లీ, మండల, గ్రామ స్థాయి కమిటీలలో కష్టపడే వారికి స్థానం కల్పిస్తామని తెలిపారు. అనంతరం నీట్ 2026ప్రశ్నాపత్రం లీకేజీకి ని నిరసిస్తూ మెదక్ పట్టణంలో భారీ సంఖ్యలో యూత్ కాంగ్రెస్ సభ్యులు రోడ్డుపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులతో మోదీ డౌన్ డౌన్ నినాదాలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ అసెంబ్లీ ప్రెసిడెంట్ భరత్ గౌడ్,జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ కమ్మరి రమేష్ చారి మాట్లాడుతూ నీట్ నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయిందని, నీట్ పరీక్ష పత్రం లీకేజీ వల్ల 23 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. 2021 24లో జరిగిన లీకేజీ నుండి ఇంకా గుణపాఠం నేర్చుకోలేదని, నీట్ పరీక్ష పత్రం లీకేజీ కి బాధ్యత వహిస్తూ వెంటనే మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎన్టీయే డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పరశురామ్ గౌడ్ , మెదక్ అసెంబ్లీ ప్రెసిడెంట్ భరత్ గౌడ్ ,మెదక్ జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, కోఆర్డినేటర్ కమ్మరి రమేష్ చారి, హృషీకేశ్, మండల అధ్యక్షులు పవన్, నాగరాజు, రిజ్వాన్ యూత్ కాంగ్రెస్ సభ్యులు అహ్మద్, శ్రీధర్, రాము, మహేష్, కార్తీక్, కిరణ్,లక్ష్మణ్, భాను, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా లో ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ & రిజిస్ట్రేషన్ మేళా

* ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సి.హెచ్. వినీల్ కుమార్

జనగామ, ప్రజాస్ఫూర్తి: జిల్లా లోని ఆహార వ్యాపార నిర్వాహకుల (ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు) కోసం ఎఫ్.ఎస్. ఎస్. ఏ.ఐ (FSSAI) లైసెన్స్ మరియు రిజిస్ట్రేషన్ మేళాను 16మే 2026న నిర్వహించనున్నట్లు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సి.హెచ్. వినీల్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆహార పరిరక్షణ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆహార వ్యాపార రంగంలో పనిచేస్తున్న హోటళ్లు, బేకరీలు, టీ స్టాళ్లు, రెస్టారెంట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కిరాణా దుకాణాలు, స్వీట్స్ షాపులు తదితర వ్యాపార సంస్థల నిర్వాహకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ మేళా జిల్లా కలెక్టర్ కార్యాలయం (IDOC) లోని రూమ్ నెం. G2 లో మే 16 వ తేదీ ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గం. వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. కొత్తగా ఆహార వ్యాపారాలు ప్రారంభిస్తున్న వారు ఎఫ్. ఎస్.ఎస్.ఏ.ఐ రిజిస్ట్రేషన్ లేదా లైసెన్స్ పొందవచ్చని, ఇప్పటికే లైసెన్స్ కలిగిన వారు రెన్యువల్ ప్రక్రియను కూడా ఈ మేళా ద్వారా పూర్తి చేసుకోవచ్చని వివరించారు. ఆహార భద్రత ప్రమాణాలను పాటించడం ప్రతి ఆహార వ్యాపార నిర్వాహకుడి బాధ్యత అని అధికారులు తెలిపారు. ఎఫ్. ఎస్.ఎస్.ఏ.ఐ లైసెన్స్ ద్వారా వినియోగదారు లకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. అలాగే ఆహార వ్యాపార సంస్థలపై తనిఖీలు నిర్వహించే సమయం లో లైసెన్స్ తప్పనిసరిగా ఉండా లని సూచించారు. జిల్లా లోని ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు పెద్ద సంఖ్య లో పాల్గొని లైసెన్స్, రిజిస్ట్రేషన్, రెన్యువల్ సేవలను పొందాలని కోరారు. ఇతర వివరాల కోసం ఆహార భద్రత అధికారి 7306335795, గెజిటెడ్ ఫుడ్ ఇన్స్పెక్టర్ 9985820544 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

# పి సి పి ఎన్ డిటి జిల్లా అప్రాప్రియేట్ అథారిటీ సమావేశం



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ అనురాగ్ జయంతి అధ్యక్షతన ఐ డి ఓ సి మీటింగ్ హాల్లో సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో ఇప్పటివరకు పి సి పి ఎన్ డి టి యాక్ట్ కింద స్కానింగ్ సెంటర్లు పర్మిషన్ కొరకు అప్లై చేసుకున్నటువంటి హాస్పిటల్స్ కు పర్మిషన్ ఇవ్వడానికి చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో స్కానింగ్ సెంటర్ల పర్మిషన్ కొరకు అప్లై చేసుకున్నటువంటి స్కానింగ్ సెంటర్లను జిల్లా ఆపరేట్ అథారిటీ కమిటీ ఆధ్వర్యంలో ఇన్స్పెక్షన్ నిర్వహించి పర్మిషన్ ఇవ్వాలని కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశించడం జరిగింది ఈ యొక్క సమావేశంలో పి సి పి ఎన్ డి టి కమిటీ మెంబర్స్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మనోహర్ జిల్లా అడిషనల్ ఎస్పి ఎన్జీవో మెంబర్ డాక్టర్ ప్రమీల పాల్గొన్నారు.

# త్వరలో వచ్చేది.. బీసీ రాజ్యమే

* పల్లె పల్లెల్లోపాదయాత్రకు బ్రహ్మరథం పట్టిన ప్రజలు
* బీసీ రాజ్యాధికార వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేంద్ర గౌడ్



రఘునాథపల్లి, ప్రజాస్ఫూర్తి: వచ్చే రెండేళ్లలో బీసీ రాజ్యమే రానుందని.. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీసీలకు పట్టం కడతారని బిసి రాజ్యాధికార వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు ఐతగోని రాఘవేంద్ర గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. రఘునాథపల్లి మండలం కోమల్ల, గోవర్ధనగిరి గ్రామాల్లో చేపట్టిన బీసీ రాజ్యాధికార పాదయాత్రకు శుక్రవారం బడుగు బలహీన వర్గాల ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు తిలకం దిద్ది ఆశీర్వదించారు. పల్లె పల్లెలో విశేష స్పందన లభించింది. రాఘవేంద్ర గౌడ్ మాట్లాడుతూ మనకు స్వాతంత్రం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కానున్న నేటికి మన బతుకులు మారడం లేదని మన బతుకులు మారాలంటే మన ఓట్లు మనమే వేసుకోవాలని కోరారు.. పీడీత ప్రజల విముక్తి కోసం ప్రాణ త్యాగాలు చేసిన బహుజన బిడ్డల స్ఫూర్తి మరువలేనన్నారు. తెలుగు రాష్ట్రాల్లో బీసీ అన్ని రంగాల్లో వెనుకబడి పోతున్నారని ఇప్పటికైనా మనం మేలుకుంటే మన రాజ్యం మనకే వస్తదని ఆయన అన్నారు తెలంగాణలో రాజ్యాధికారం సాధించడం లక్ష్యంగా పాదయాత్ర చేపట్టడం జరిగిందని, బడుగు బలహీన మైనార్టీ ప్రజలందరూ బీసీల తోడుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా బిసి రాజ్యాధికార సమితి జిల్లా ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి పాదయాత్ర బృందం తల్వార్ తాత, కొండ లలిత, డా. విద్యారని, ఐతగొని శివ ..సుర్వి మహేందర్ కోమల్ల గ్రామ సర్పంచ్ మల్లాల అశోక్... గోవర్ధనగిరి సర్పంచ్ తోటకూరి సదానందం ముదిరాజ్... ఉప సర్పంచ్లు మాజీ సర్పంచులు యువకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ధాన్యం దిగుమతులలో రైస్ మిల్లర్ల నిర్లక్ష్యాన్ని సహించం

- కొనుగోలు కేంద్రాల దగ్గర స్టాక్ ఉన్న ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



ప్రజాస్ఫూర్తి, మెదక్: జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం దిగుమతి ప్రక్రియను మిషన్ మోడ్ లో వేగవంతం జరగాలని జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాలో సాఫీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ, కొనుగోలు చేసిన ధాన్యం దిగుమతులు,తదితర అంశాలపై అదనపు కలెక్టర్ నగేష్ . అదనపు ఎస్పీ విక్రాంత్ సింగ్ , ఆర్డీవోలు,సివిల్ సప్లై, కోపరేటివ్,, తాసిల్దార్లు, ఎంపీడీవోలు పోలీస్, డి ఆర్ డి ఓ అధికారులతో కలెక్టరేట్ కార్యాలయం నుండి గూగుల్ మీట్ ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం వరి ధాన్యం కేంద్రాలను ఏర్పాటు చేసి నిబంధనల మేరకు కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు త్రాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి కేటాయించిన రైస్ మిల్లులకు, గోదాములకు తరలించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో రైతులు ఇబ్బందులు పడకుండా కేంద్రాలకు వచ్చే ధాన్యాంని బట్టి రవాణా శాఖ అధికారులు సరిపడా ట్రాక్టర్లను సమకూర్చాలన్నారు. వరి కొనుగోలు, దిగుమతి ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రస్తుతం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిషన్ మోడ్ లో మిల్లులకు తరలించాలని, ధాన్యం దిగుమతుల విషయంలో మిల్లర్లు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం రవాణా విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, రవాణా, గన్నీ బ్యాగుల సరఫరా, హమాలీల ఏర్పాటు వంటి అంశాల్లో ఆలస్యం వహించద్దన్నారు. ఈ గూగుల్ మీట్ లో జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్, డిఎం సివిల్ సప్లై జగదీష్, శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం తరలింపులో జాప్యం పై రైతుల ఆగ్రహం

* రోడ్డుపై ధాన్యానికి నిప్పంటించి నిరసన



జనగామ, ప్రజాస్ఫూర్తి: జిల్లా లోని వరంగల్ - హైదరా బాద్ జాతీయ రహదారి పై పెంబర్తి గ్రామం వద్ద రైతులు శుక్రవారం తీవ్ర ఆందోళనకు దిగారు. కొనుగోలు కేంద్రాల్లో వడ్లు కొనుగోలు చేసినప్పటికీ ధాన్యాన్ని వెంటనే తరలించక పోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజుల తరబడి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దే నిల్వ ఉండటంతో వర్షాలు పడితే పంట నష్టపోతుందనే భయంతో రైతులు నిరసన చేపట్టారు. రైతుల ఆరోపణల ప్రకారం కొను గోలు కేంద్రాల్లో లారీల కొరత కారణంగా ధాన్యం తరలింపు ప్రక్రి య పూర్తిగా నిలిచిపోయింద నితెలిపారు. అధికారులు పలు మార్లు హామీలు ఇచ్చినా పరిస్థితి లో మార్పు రాలేదని, తమ కష్టా నికి సరైన ఫలితం దక్కడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యాన్ని అమ్మేందుకు రోజుల తరబడి కేంద్రాల వద్ద కాపలా కాస్తూ ఇబ్బందులు పడుతున్నా మని రైతులు పేర్కొన్నారు. అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా రైతులు జాతీయ రహదారి పైకి వచ్చి రోడ్డుమీద ధాన్యం పోసి, దానికి నిప్పంటించి ఆందోళన చేపట్టారు. ఈ ఘటనతో కొంత సేపు వరంగల్ - హైదరాబాద్ జాతీయ రహదారి పై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రహదారి పై భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. అనంతరం సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడించి ధాన్యం తరలింపు ను వేగవంతం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. రైతులు మాట్లాడు తూ ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని త్వరితగతిన తరలించాలని, గన్ని బ్యాగులు, హమాలీలు, లారీలను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

– ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గిరిజనులకు ఎన్నికలలో ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్ అన్నారు. శుక్రవారం కొత్తగూడెం బస్టాండ్ ఏరియాలో జరిగిన ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా ముఖ్యనాయకుల సమావేశంలో రమేష్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు చేవెళ్ల ప్రజాగర్జన వేదికగా ఎస్టీల సంక్షేమం కోసం 12ప్రధాన అంశాలతో కూడిన 'ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్'ను ప్రకటించిందని గుర్తుచేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో ఈ డిక్లరేషన్‌ను వెల్లడించారని అన్నారు. ఈ 12హామీల అమలులో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. అంబేద్కర్ అభయహస్తం కింద ఎస్టీ కుటుంబానికి రూ.12లక్షల ఆర్థిక సాయం, భూమి లేని గిరిజనులకు 3ఎకరాల భూమి, అసైన్డ్ భూములకు పూర్తి యాజమాన్య హక్కులు, గిరిజనులకు పోడు భూములపై పూర్తి యాజమాన్య హక్కులు, ఇళ్లు లేని గిరిజనులకు ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షల సహాయం, ప్రభుత్వ ప్రయోజనాలు పొందే ప్రైవేట్ కంపెనీలు, సంస్థలలో ఎస్టీలకు రిజర్వేషన్లు.ఉపాధి - కాంట్రాక్టులు: ప్రభుత్వ కాంట్రాక్టులలో ఎస్టీలకు 12శాతం రిజర్వేషన్లు తదితర హామీలు ఇచ్చారని వివరించారు. ఈ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టి లంబాడీల ఓట్లతో గెలిచినప్పటికీ రాష్ట్ర కేబినెట్‌లో మంత్రి పదవి ఇవ్వకుండా లంబాడీలకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26వ తేదీన హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద జరిగే మహా ధర్నాకు లంబాడీలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్ నాయక్, ప్రసాద్ నాయక్, మంగీలా నాయక్, బాలాజీ నాయక్, రవి నాయక్S తదితరులు పాల్గొన్నారు.

# ఐకేపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే కడియం



జనగామ / లింగాల ఘణపురం, ప్రజాస్ఫూర్తి: జిల్లాలోని లింగాల ఘణపురం మండలం లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి వెళుతున్న స్టేషన్ ఘనపూర్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి నెల్లుట్ల లోని ఐకేపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోళ్లు ఎలా జరుగుతున్నాయి,, ధాన్యం రవాణా సక్రమంగా జరుగుతోందా అనే విషయాలను రైతులు, నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రం లో ధాన్యం కంటాలు పూర్తయినప్పటికీ లారీలు అందుబాటులో లేక పోవడం, రైస్ మిల్లుల వద్ద లోడ్ అయిన లారీల అన్‌లోడింగ్ ఆలస్యం కావడంతో సమస్యలు ఎదురవుతున్నాయని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. ఇప్పటికే కేంద్రంలో మూడు వేల బస్తాలకు పైగా ధాన్యం నిల్వ ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నా రని నిర్వాహకులు తెలిపారు.దీని పై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ కు ఫోన్ చేసి కంటా అయిన ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు తరలించేలా లారీలు ఏర్పాటు చేయాలని ఆదేశించా రు. అలాగే రైస్ మిల్లు యాజమాన్యం తో మాట్లాడి లోడైన లారీ ల ను వెంటనే అన్ లోడ్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఒకటి రెండు రోజుల్లో కొనుగోళ్ల ప్రక్రియను మరింత వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మండల కేంద్రం లోని మోడల్ స్కూల్‌లో అసంపూర్తిగా ఉన్న హాస్టల్ భవన నిర్మాణ పను లకు రూ.1.44 కోట్లు మంజూరు చేయించి శంకుస్థాపన చేశారు. అలాగే బండ్లగూడెం లోని కస్తూరి భా గాంధీ పాఠశాలలో రూ.42 లక్షలతో అదనపు తరగతి గదు లు, టాయిలెట్ బ్లాకుల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ రాష్ట్రం లోని ఎక్కువశాతం మోడల్ స్కూల్‌లలో హాస్టల్ భవనాల నిర్మాణం పూర్తయింద ని, లింగాల ఘణపురం మోడల్ స్కూల్ లో మాత్రం అనివార్య కారణాల వల్ల పనులు నిలిచి పోయాయని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత ప్రత్యేక చొరవ తో నిధులు మంజూరు చేయించి ప్రస్తుతం పనులు ప్రారంభ మయ్యాయని వెల్లడించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం లో విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్న ఆయన, గత రెండు సంవత్సరాల్లో విద్యా రంగానికే రూ.219 కోట్లు మంజూ రు చేయించినట్లు తెలిపారు. కేజీ బీవీ లు, గురుకులాలు, మోడల్ స్కూల్ లలో తాగునీరు, టాయిలెట్లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటు న్నామని చెప్పారు. ప్రధాన రహ దారి నుంచి మోడల్ స్కూల్ వరకు సీసీ రోడ్డు, కిచెన్ షెడ్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశిం చారు. తదనంతరం జీడికల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు కొండ బోయిన రాజు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం లో అకాల మరణం చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఆర్యవైశ్య మహాసభ పట్టణ కమిటీ అధ్యక్ష ఎన్నికలు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: ఆర్యవైశ్య మహాసభ సూర్యాపేట పట్టణ కమిటీ అధ్యక్ష ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరిగిన సమావేశంలో ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు మరియు ఎన్నికల నిర్వహణ బాధ్యతను చేపట్టే ఆర్యవైశ్య ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పోటి చేసే అభ్యర్థులు నియమావళిని ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. నామినేషన్ వేసే అభ్యర్థులు రూ.5వేల డిపాజిట్ చేయాలని అన్నారు. నామినేషన్ పత్రంలో వున్న వివరాలను పూర్తి చేయాలని , నామినేషన్ పత్రంలో కోరిన విధంగా తగిన ఆధారాలు సమర్పించాలని అన్నారు. పట్టణ కమిటీ అధ్యక్ష ఎన్నిక 31మే, 2026తేదీన స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఉదయము ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.. ఎన్నికల సమయంలో అందరూ సంయమనం పాటించాలని, ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరగడానికి సహకరించాలన్నారు. సెల్ ఫోన్ లు తీసుకొని ఎవరు రాకూడదని తెలిపారు. ఓటు వేయడానికి ప్రభుత్వ గుర్తింపు కార్డు తీసుకుని రావాలని అన్నారు. నియమావళిని అతిక్రమిస్తే తగిన చర్యలు చేపడుతామని తెలిపారు. నిర్వహణ కమిటీ సభ్యులు తటస్థంగా వుండాలని చెప్పారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఓటర్ లిస్ట్ కాపీలను సిద్ధం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు, మాజీ జిల్లా అధ్యక్షులు కర్నాటి కిషన్, జిల్లా క్రమశిక్షణ సంఘం చైర్మన్ బండారు రాజా, జిల్లా కోశాధికారి చల్లా లక్ష్మీకాంత్, పట్టణ అధ్యక్షుడు మంచాల రంగయ్య, నాయకులు తోట శ్యామ్ ప్రసాద్, రాచర్ల కమలాకర్, బొమ్మిడి లక్ష్మీనారాయణ, తప్పి గాంధి, గుండా శ్రీధర్, కొండా శ్రీనివాస రావు, విశ్రాంత ఉపాధ్యాయులు గుండా రమేష్, పి వి లక్ష్మినారాయణ, దేవరశెట్టి జనార్ధన్, వనమాల వెంకటేశ్వర్లు, దిండిగపు యాదగిరి, బిక్కుమళ్ల అరుణ్ కుమార్, ఓరుగంటి శ్రవణ్ కుమార్, తల్లాడ ఉపేందర్, సోమా సురేష్, బండారు శేఖర్, కంది బండ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## జ్యువెలరీ షాపులపై సెమినార్ నిర్వహించిన ఎస్ఐ



వలిగొండ ప్రజాస్ఫూర్తి : వలిగొండ పోలీస్ స్టేషన్లో శుక్రవారం జ్యువెలరీ షాపుల యజమానులు, సిబ్బందికి భద్రతా చర్యలపై ఎస్ఐ. యుగేందర్ గౌడ్ సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ. నిఘా పెంచడం: షాపుల చుట్టుపక్కల, లోపల అధునాతన సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని.సూచించారు. అలారం సిస్టమ్: ఏదైనా అనుమానాస్పద చర్యలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందేలా ఎమర్జెన్సీ అలారం ఏర్పాటు చేసుకోవాలి.భద్రతా సిబ్బంది: షాపు వద్ద అనుభవజ్ఞులైన సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలని, అన్నారు అలాగే ఎంట్రీ మరియు ఎగ్జిట్ పాయింట్ల వద్ద నిఘా పెట్టాలన్నారు. అనుమానితులపై నిఘా.కొత్తగా వచ్చేవారిపై,షాపు పరిసరాల్లో అనుమానంగా తిరిగేవారిపై,రెక్కీ' నిర్వహిస్తున్నారా అన్న కోణంలో దృష్టి పెట్టాలని సూచించారు. బంగారం విక్రయాల్లో నిబంధనలను కచ్చితంగా పాటించాలని, అన్నారుఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షులు కొండపర్తి బాల చారి ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కన్నెకంటి శ్రీనివాసా చారి ఆ సంఘం సీనియర్ నాయకులు కన్నెకంటి స్వామి మండల కార్యదర్శి దాసోజు శ్రీనివాసాచారి మండల కోశాధికారి సిహెచ్. సత్యనారాయణ చారి, భోగ రవి నామల రవి.హర్షరాం తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన భాండగారాలు

**- కలెక్టర్ కె హరిత**



ప్రజా స్ఫూర్తి , కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా: గ్రంథాలయాలు విజ్ఞాన భాంగాధారాలు పుస్తకాలను చదవడం ద్వారా ఉద్యోగా ఉపాధి మార్గాలె కాకుండా జ్ఞానవికాసంతో మధురానుభూతి ఆనందం పొందాడానికి ఉపయోగపడుతుందని యువత పుస్తకాలు చదవడం తప్పని సరిగా అలవర్చుకోవాలని కలెక్టర్ కె హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంధాలయంలో ప్రజాపాలన -ప్రగతిప్రణాళిక కార్యక్రమములో భాగంగా విద్యా వారోత్సవాల కార్యక్రమములో భాగంగా ఏర్పాటు చేసిన గ్రంధాలయ దినోత్సవము కార్యక్రమములో జిల్లా గ్రంధాలయ చైర్మెన్ కామడే అనిల్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు జిల్లా విద్యా శాఖా అధికారి లలితతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రంధాలయాలు విజ్ఞాన భాండగారాలు అని అన్నారు గ్రంధాలయాలకు నేటి యువత తప్పనిసరిగా రావాలన్నారు గ్రంధాలయాలలో ఎన్నో నవలలు, చరిత్రకు సంబందించిన పుస్తకాలు గొప్ప వారి చరిత్రకు సంబందించిన పుస్తాకాలు గ్రంధాలయాలలో అందుబాటులో ఉంటాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కొరకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు గ్రంధాలయాలు చక్కని వేదిక అన్నారు. గ్రంధాలయాల అభివృద్ధి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఈ గ్రంధాలయములో సన్నద్ధమై ప్రభుత్వ ఉద్యోగాలు సాదించిన వారిని శాలువాలతో సన్మానం చేశారు కవులను సన్మానం చేశారు. ఈ కార్యక్రమములో కౌన్సిలర్లు జిల్లా గ్రంధాలయ శాఖ అధికారులు పాఠకులు, కవులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో సమస్యలు తలెత్తకుండా చూడాలి

**– జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే ప్రక్రియలో భాగంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. శుక్రవారం సుజాతనగర్ మండలంలోని కొనుగోలు కేంద్రాన్ని ఎస్పీ సందర్శించి సంబంధిత శాఖల అధికారులతో కలిసి రైతులతో సమావేశమయ్యారు. ఎస్పీ రైతులు తమ సమస్యల గురించి వివరించారు. రైతుల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ముఖ్యంగా గన్నీ బ్యాగులు, కొనుగోలు చేసిన ధాన్యం రవాణాకు సంబంధించి, ధాన్యాన్ని కప్పి ఉంచడానికి ఉపయోగించే టార్పలిన్ పట్టాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రైతులకు అండగా నిలబడాలని సూచించారు. ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత అధికారులతోపాటు పోలీసు వారికి కూడా సమాచారం అందించాలని కోరారు. అనంతరం ధాన్యం కొనుగోలు, గ్రేడింగ్ విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, ఎస్బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు రమాదేవి, రవి, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## బండి భగీరథ్ ను వెంటనే అరెస్టు చేయాలి

*** కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ లింగం**



వలిగొండ ప్రజాస్ఫూర్తి : *కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ ను వెంటనే పోలీసులు అరెస్టు చేయాలని కేవీపీస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ లింగం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శుక్రవారం వలిగొండ మండల కేంద్రంలో పత్రిక ప్రకటన విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు, బండి భగీరథ బాలికను వేధించి బలవంతంగా మద్యం తాగించి అత్యాచారం చేసిన కేసులో పోలీసులు అనుసరిస్తున్న తీరు సరి అయింది కాదన్నారు. నిందితున్ని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.దేశంలో చట్టబద్ధ, రాజ్యాంగబద్ధ సంస్థలను బీజేపీ నిర్వీర్యం చేస్తుందని చెప్పడానికి ఇదే ఉదాహరణ అని అన్నారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యనిపై చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీలు సామాజిక ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తుంటే విషయాన్ని పక్కదోవ పట్టించడానికి దేశం గురించి ధర్మం గురించి నీతులు వల్లించడం సిగ్గుమాలిన చర్య అన్నారు, వెంటనే తన కొడుకు కేసు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి పదవికి బండి సంజయ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## ధాన్యం లోడింగ్ ప్రక్రియ లో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలి

*** జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



భువనగిరి ప్రజాస్ఫూర్తి : జిల్లాలో రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు , లోడింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. భూదాన్ పోచంపల్లి మండలం జాలూరు గ్రామంలోని పి.ఏ.సి.ఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కేంద్రంలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అధికారులను, నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ధాన్యం కొనుగోలు ప్రారంభించి ఎన్ని రోజులు అయ్యిందని, ఇప్పటి వరకు ఎంత మేర ధాన్యం కొనుగోలు చేశారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రంలో ఎంత ధాన్యం నిల్వ ఉన్నాయని ఆరా తీశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేగంగా కొనుగోళ్లు కొనసాగించాలని సూచించారు. రోజుకు ఎన్ని లారీల ధాన్యం లోడింగ్ చేసి పంపుతున్నారని అడిగి తెలుసుకున్నారు. లారీలు సరిపడా ఉన్నాయా అని ఆరా తీశారు. లారీలు తక్కువగా రావడం వల్ల కాంటా ప్రక్రియలో ఏమైనా ఆలస్యం జరుగుతుందా అని అడిగి తెలుసుకున్నారు. రైతులు ధాన్యాన్ని కేంద్రానికి తీసుకొచ్చిన తర్వాత ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈరోజు నుంచే ప్రతిరోజూ కనీసం 8నుంచి 10లారీలు లోడ్ అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అందుకు అనుగుణంగా ధాన్యం కాంటా వేయాలని తెలిపారు. మిల్లుల వద్ద ధాన్యం వెంటనే అన్‌లోడ్ అయ్యేలా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ఆలస్యం చేయవద్దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై మేనేజర్ హరికృష్ణ,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మోదీది డబుల్ ఇంజన్ సర్కార్ కాదు..

*** రెండు నాలుకల సర్కార్**

**-* పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి**



మోదీ సారధ్యంలో ఉన్నది డబుల్ ఇంజన్ సర్కార్ కాదు, రెండు నాలుకల సర్కార్. ఎన్నికలకు ముందు ఒకలా, ఎన్నికలు ముగిసిన తర్వాత మరోలా వ్యవహరిస్తున్నారని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు పూర్తవగానే పెట్రోల్ ధరలు పెంచి బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలను మరోమారు మోసం చేసింది. నరేంద్ర మోదీ ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచి అతని అవకాశ వాద రాజకీయాలను మరోసారి బహిర్గతం చేశారు. పెట్రోల్, డీజిల్ ఆరు నెలల స్టాక్ ఉందని గొప్పలకు పోయి ఇప్పుడు మళ్లీ యుద్ధమే కారణమని చెప్పడం గమనార్హం. తెలంగాణ రాష్ట్రం నుండి ఎంపీలుగా గెలిచి కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి ,బండి సంజయ్ పెట్రోల్ ధరలు పెరగవని చాలాసార్లు ప్రకటించారు. ఇప్పుడు ఎలా పెంచారో, ఎందుకు పెంచారో ప్రజలకు సమాధానం చెప్పాలి. అలాగే పెట్రోల్ డీజిల్ ట్యాక్స్ లను రాష్ట ప్రభుత్వం భరిస్తే ప్రజలపై భారం పడదని గత అసెంబ్లీ ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి, సీతక్క ప్రగల్భాలు పలికారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై భారం పడకుండా ట్యాక్స్ లను భరించి పెరిగిన ధరలను ప్రభుత్వమే భరించాలి. కొద్ది రోజుల క్రితం హైదరాబాద్ పర్యటన లో పెట్రోల్ ,డీజిల్ తక్కువ వాడండి బంగారం కొనవద్దు, నూనె తక్కువ వాడాలని మోదీ చెప్పినప్పుడే ప్రజలకు అనుమానం వచ్చింది. అధికారంలో ఉండి అడ్డగోలుగా ధరలు పెంచుతూ దేశ ప్రజల నడ్డి విరుస్తున్న ఈ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు పై ప్రజలు మండిపడుతున్నారు. సమీప భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని విశ్వసిస్తున్నాను.

## ప్రజా పోరాటాలతోనే పేదల సమస్యల పరిష్కారం

*** ప్రభుత్వ విధానాలపై రాజీలేని పోరాటం అవసరం**

*** సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రజా పోరాటాల ద్వారానే పేదల సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా పేర్కొన్నారు. సిపిఐ జూలూరుపాడు, అన్నపురెడ్డిపల్లి మండల కౌన్సిల్ సమావేశాలు శుక్రవారం ఆయా మండల కేంద్రాల్లో నిర్వహించారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో కార్యకర్తలు ముందుండాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడేది ఎర్రజెండా మాత్రమేనని అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గడువులోగా పూర్తి చేసి గ్రామస్థాయి కమిటీలను బలోపేతం చేయాలని సూచించారు. భవిష్యత్ కార్యాచరణకు అనుగుణంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యకర్తలు ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఈ సమావేశాల్లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్, జూలూరుపాడు మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్ రావు, చంద్రుగొండ మండల కార్యదర్శి బొర్రా కేశవరావు, అన్నపురెడ్డిపల్లి మండల కార్యదర్శి ఊకే నారాయణ, జిల్లా సమితి సభ్యులు నాగుల్ మీరా, జడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రేడ్ వన్ శాఖ గ్రంథాలయంషాద్ నగర్ ఆధ్వర్యంలో ఘనంగా గ్రంథాలయ దినోత్సవం

*** ముఖ్యఅతిథిగా హాజరైన ఫరూక్ నగర్ మండలం ఎంఈఓ మనోహర్**

*** గ్రంథాలయానికి 300 పుస్తకాలను బహూకరించిన మాజీ గ్రంథాలయ శాఖ చైర్మన్ లక్ష్మీనరసింహారెడ్డి**



ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : రంగారెడ్డి జిల్లా షాద్నగర్ :ప్రజా పాలనప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా గ్రేడ్‌వన్ శాఖ గ్రంథాలయం అభివృద్ధి కమిటీ షాద్ నగర్ ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ఫరూక్ నగర్ మండల విద్యాశాఖ అధికారి మనోహర్ విచ్చేసి, గ్రంథాలయంలో నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శనలో పాల్గొని, నేటి సమాజానికి గ్రంథాలయాలు జీవన సోపానానికి ఎంతో దోహదపడతాయని,పుస్తకాలు చదవడం వలన జ్ఞానంతో పాటు విజ్ఞానాన్ని కూడా పొందవచ్చు అని అన్నారు.ఈ గ్రంథాలయంలో విద్యార్థిని విద్యార్థులకు, పెద్దలకు, మహిళలకు, దేశ సాంప్రదాయానికి సంబంధించిన మరియు పౌరాణిక పుస్తకాలు సైతం ఇక్కడ ప్రదర్శించడం ఎంతో అభినందనీయమన్నారు. షాద్ నగర్ నియోజక వర్గంలోని ప్రతి ఒక్కరు ఈ గ్రంథాలయాన్ని సందర్శించాలని, వారికి అవసరమైన పుస్తకాలను ఎంచుకొని చదువుకోవడానికి, ఎంతో వీలుంటుందని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ చైర్మన్ కొప్పుల మదన్ మోహన్ రెడ్డి,వైస్ చైర్మన్ లు నక్క బాల్ రాజ్ యాదవ్,సి.వీరేష్, ప్రధాన కార్యదర్శి క్యాసెట్ శ్రీనివాస్, ట్రెజరర్ నీళ్ల రవీందర్ గౌడ్, జాయింట్ ట్రెజరర్ కత్తి చంద్రశేఖర్ అప్ప,డైరెక్టర్లు,ర్యాకల శ్రీకాంత్ ముదిరాజ్,కాట్నా రాజేష్ లడ్డు, చీపిరి శివరాములు యాదవ్,కే.రవి నాయక్ ఎంబడి అనిల్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## యువ అథ్లెట్ రియాజ్ పాషా ను అభినందించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరం ప్రాంతానికి చెందిన యువ అథ్లెట్ రియాజ్ పాషాను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌తో పాటు 3వ తెలంగాణ త్రోయర్స్ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచి వరుస విజయాలు సాధించిన సందర్భంగా ఆయనకు నగదు బహుమతి అందజేశారు. కళా స్రవంతి సాంస్కృతిక సంస్థ కోఆర్డినేటర్ దోతి బాబు రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ రోహిత్ రాజు చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో 15వ డివిజన్ కార్పొరేటర్ అకునూరి సుప్రియా, 17వ డివిజన్ కార్పొరేటర్ యరబెల్లి శంకర్, కాంగ్రెస్ మైనారిటీ జిల్లా నాయకుడు కరీమ్ పాషా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె. మహీధర్, కోచ్‌లు సుష్మ భాయ్, మల్లికార్జున్‌లు రియాజ్ పాషాను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## పి సి పి ఎన్ డిటి జిల్లా అప్రూప్రియేట్ అథారిటీ సమావేశం

భువనగిరి ప్రజాస్ఫూర్తి : *కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ అనురాగ్ జయంతి అధ్యక్షతన ఐ డి ఓ సి మీటింగ్ హాల్లో సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో ఇప్పటివరకు పి సి పి ఎన్ డి టి యాక్ట్ కింద స్కానింగ్ సెంటర్లు పర్మిషన్ కొరకు అప్లై చేసుకున్నటువంటి హాస్పిటల్స్ కు పర్మిషన్ ఇవ్వడానికి చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో స్కానింగ్ సెంటర్ల పర్మిషన్ కొరకు అప్లై చేసుకున్నటువంటి స్కానింగ్ సెంటర్లను జిల్లా ఆపరేట్ అథారిటీ కమిటీ ఆధ్వర్యంలో ఇన్స్పెక్షన్ నిర్వహించి పర్మిషన్ ఇవ్వాలని కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశించడం జరిగింది ఈ యొక్క సమావేశంలో పి సి పి ఎన్ డి టి కమిటీ మెంబర్స్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మనోహర్ జిల్లా అడిషనల్ ఎస్పి ఎన్జీవో మెంబర్ డాక్టర్ ప్రమీల పాల్గొన్నారు.


## శిశు మరణాలను నివారించాలి

**– డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం రాథోడ్**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: శిశు మరణాలను నివారించేందుకు ఆరోగ్య సిబ్బంది అందరూ సమిష్టిగా పనిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ సూచించారు. జిల్లా చైల్డ్ హెల్త్, ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ ప్రతాప్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని డిఎంహెచ్ఓ కార్యాలయంలో ఏప్రిల్ నెలకు సంబంధించిన చిన్నారుల మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల మరణాలకు సంబంధించిన వివరాలను సమగ్రంగా పరిశీలించి, మరణాలకు దారితీసిన కారణాలపై విచారణ చేపట్టారు. భవిష్యత్తులో ఇలాంటి మరణాలను నివారించేందుకు అవసరమైన చర్యలపై వైద్య అధికారులకు సూచనలు చేశారు. గర్భిణీలు, బాలింతలకు ప్రసవం అనంతరం పిల్లలు రెండు సంవత్సరాలు వయస్సు వచ్చే వరకు నిరంతర ఆరోగ్య, విద్య, పోషకాహార సూచనలు, వైద్య సేవలపై అవగాహన కల్పించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు, సీహెచ్‌వో నాగభూషణం, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్



ప్రజాస్ఫూర్తి, షాద్ నగర్ : మున్సిపల్ 15వార్డులో నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించిన షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, నేతలు సాదిక్, శ్రీశైలం గౌడ్, మాజీ ఎంపీపీ ఇద్రిస్ మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ల లింగంను పరామర్శించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్



ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : ఎలికట్ట గ్రామానికి చెందిన ఆర్ల లింగం ఇటీవల ఊపిరితిత్తుల శస్త్ర చికిత్స చేయించుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా, వారి స్వగృహానికి వెళ్లిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యం చెబుతూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో సీనియర్ నాయకులు సంజీవయ్య, మాజీ సర్పంచ్ సాయి ప్రసాద్ తదితరులున్నారు.

# స్కూటీ దొంగతనం కేసులో నిందితుడు అరెస్ట్




జనగామ, ప్రజాస్ఫూర్తి : జనగామ పట్టణం లో జరిగిన స్కూటీ దొంగతనం కేసును చేధించి నిందితుడు అరెస్ట్ చేసిన పోలీసులు. శుక్రవారం ఎస్ఐ భరత్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణం లోని రైల్వే స్టేషన్ రోడ్డు కు చెందిన దిడిగం నరేష్ తండ్రి నాగరాజు తన హోండా యాక్టివా స్కూటీ దొంగతనానికి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చే పట్టినట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా స్కూటీ దొంగతనానికి పాల్పడిన పోతర వేని రాజు తండ్రి కొమరయ్య, సిద్దిపేట జిల్లా, నంగునూరు మండలం, నర్మెట్ల గ్రామం, ప్రస్తుతం ముషీరాబాద్, హైదరాబాద్ లో నివాసం ఉంటున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణ లో అతను చేసిన దొంగతనం చెసి నట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి ని అరెస్ట్ చేసి అతని వద్ద నుండి దొంగిలించిన హోండా యాక్టివా స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం నిందితు డిని కోర్టులో హాజరు పరిచి జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

# సీనియర్ జర్నలిస్టు పందిరి వెంకట రెడ్డిని పరామర్శించిన బీజేపీ నాయకులు



కూసుమంచి ప్రజా స్ఫూర్తి: సీనియర్ జర్నలిస్టు పందిరి వెంకట రెడ్డి పరామర్శించిన బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి కూసుమంచి మండల కేంద్రంలో ఇటీవల కాలి శస్త్ర చికిత్స విజయవంతం గా పూర్తి చేసుకుని వారి స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న సీనియర్ జర్నలిస్ట్ పందిరి వెంకట రెడ్డిని కలసి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడం జరిగింది. వారు త్వరగా కోలుకొని మరియు వారి వృత్తిలో త్వరలోనే ఉత్సాహంగా పాల్గొనాలని ఆశించడం జరిగింది. పరామర్శించిన వారిలో బీజేపీ నాయకులు మంద నవ్య చంద్రశేఖర్ గౌడ్, బద్దం వెంకట్ రెడ్డి, మంద చంద్రశేఖర్ గౌడ్, పిట్టల వేణు, గుండా విజయ్ పాల్ రెడ్డి తదితరులున్నారు.

# మున్నేరు పాలేరు లింక్ కెనాల్ వద్దు: ప్రజాభిప్రాయ సేకరణలో 95% వ్యతిరేకత



మహబూబాబాద్,ప్రజాస్ఫూర్తి; తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న 'మున్నేరు పాలేరు లింక్ కెనాల్' ప్రాజెక్టుపై స్థానిక ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. జి.ఓ నంబర్ 98ద్వారా ఈ ప్రాజెక్టును తెరపైకి తెచ్చిన ప్రభుత్వం, మున్నేరు వరద నీటిని పాలేరుకు తరలించాలని యోచిస్తోంది. అయితే, ఈ నిర్ణయం పట్ల స్థానిక రైతులు, మేధావులు మరియు ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు తీవ్ర విముఖత (వ్యతిరేకత) వ్యక్తం చేస్తున్నాయి. తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు న్యాయవాది విశ్వ జంపాల ఏప్రిల్ 14నుంచి మే 15తేదీ వరకు నిర్వహించిన ఒక ఆన్‌లైన్ ప్రజాభిప్రాయ సేకరణ ఫలితాలను శుక్రవారం గార్ల మండల కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం వద్ద అఖిలపక్ష నేతలతో కలిసి విశ్వ వెల్లడించారు.

**సర్వే ఫలితాలు ఏం చెబుతున్నాయి?**

వివిధ వర్గాలకు చెందిన సామాన్య ప్రజలు, రైతులు, కూలీలు, యువత, మహిళలు, వర్తక వ్యాపారులు, విద్యావంతులు, మేధావులు పాల్గొన్న ఈ సర్వేలో షాకింగ్ నిజాలు వెల్లడైనాయి. మొత్తం ఓట్లు: 651, రద్దు చేయాలి (అవును): 95.24% (620 ఓట్లు), రద్దు చేయవద్దు (కాదు): 4.76% (31 ఓట్లు) పాల్గొన్న దేశాలు: అత్యధికంగా భారతదేశం (98.92%) నుండి స్పందన రాగా, అమెరికా మరియు ఒమన్‌లోని ప్రవాస భారతీయులు కూడా తమ మద్దతు తెలిపారు. ఈ మొత్తం సర్వే లో గార్ల మండలం నుంచి సుమారు 80 శాతం మంది వివిధ వర్గాల ప్రజలు ఈ ఆన్ లైన్ ఓటింగ్ లో పాల్గొని మున్నేరు పాలేరు లింక్ కెనాల్ రద్దు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ సర్వేలో పాల్గొన్న ఓటర్లు గార్ల మండలానికి జరుగుతున్న అన్యాయాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ లింక్ కెనాల్ ద్వారా ఏజెన్సీ ప్రాంతాన్ని ఎడారిగా మారుస్తున్నారని, ఇది 'పెసా' (PESA) చట్టం ఉల్లంఘనేనని ఆరోపిస్తున్నారు.

**మున్నేరు రిజర్వాయర్ డిమాండ్:**

లింక్ కెనాల్ కు బదులుగా మున్నేరుపై రిజర్వాయర్ నిర్మించి మున్నేరు పరివాహక ప్రాంతంలో 60 వేల ఎకరాలకు సాగునీరు, త్రాగు నీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు, మున్నేరు జలసాధన కమిటీ కన్వీనర్ గంగావత్ లక్ష్మణ్ నాయక్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, పల్లెబోయిన లింగయ్య కట్టెబోయిన బిక్షమయ్య, లింగాల చెన్నయ్య, బానోత్ ఈర్యా నాయక్, అలువాల శ్రీనివాస్, దేశపాక మురళి, పి.శ్యాం తదితరులు పాల్గొన్నారు.

# పుస్తకం చదవండి జ్ఞానం పెంపొందించుకోండి

*** జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి**




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి; తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ పుస్తకం చదవండి జ్ఞానం పెంపొందించుకోండి సమాజాన్ని వెలిగించండన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని సంపాదించాలని మొబైల్ ఫోన్లకు పరిమితం కాకుండా పుస్తకాలతో స్నేహం చేయాలని మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో , గ్రంథాలయ పాఠకులకు కావలసిన వసతులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని పాఠకులు తమ సమస్యలను నేరుగా తనకు తెలియజేయాలని సూచించారు, సమాజ అభివృద్ధి కి విద్య ఎంతో ముఖ్యమని ప్రతి విద్యార్థి ఉన్నంత లక్ష్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి టి శ్రీలత, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి, సీనియర్ పాఠకుడు టీవీ రామనర్సయ్య, డిఎస్ఓ అప్పారావు , ఏ సి జి, మందుల శ్రీరాములు, ఏ ఎస్ సి సంతోష్,ముక్క లక్ష్మణరావు, నరసింగ శ్రీనివాస్, జ్ఞానేశ్వర్ గ్రంథపాలకులు, జి విజేందర్, సిహెచ్ రవి, రుద్రారపు వీరేందర్ ,భూలక్ష్మి, యాదమ్మ బాబా , పుస్తక ప్రియులు , పాఠకులు , విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అత్యధికంగా 3828.150 మెట్రిక్ టన్నులు 76,563 వేల బస్తాల మక్కజొన్నల తరలింపు

*** మక్కజొన్న కేంద్రాల ప్రత్యేక అధికారులు, పోలీస్ యంత్రాంగం సహకారంతో గోదాం,మిల్లులకు తరలింపు**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి; జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పక్క ప్రణాళికతో జిల్లాలో నడుస్తున్న 25మక్కజొన్న కొనుగోలు కేంద్రాలకు 25మంది జిల్లాస్థాయి ప్రత్యేక అధికారులను నియమించి పకడ్బందీ వ్యూహంతో రవాణా శాఖ, పోలీస్ శాఖ రెవెన్యూ శాఖలు పూర్తిస్థాయిలో నిమగ్నమై రూపొందించిన ప్రణాళికా ప్రకారం ఈరోజు ఒక్కరోజే అత్యధికంగా 30 వేల బస్తాలు, 3 వేల మెట్రి టన్నుల మక్కజొన్నలను ఇప్పటికే గుర్తించి స్వాధీన పరుచుకున్న మిల్లులు, గోదాములకు తరలించడం జరిగింది. ప్రతి మిల్లు, గోదాముకు ఒక అధికారిని, ప్రతి సెంటర్ వద్ద నిత్యం నిబద్ధత కలిగిన ఉద్యోగిని నియమించి ప్రతి గంటకి సమీక్షలు నిర్వహిస్తూ ప్రస్తుత రవాణా సదుపాయాలతో పాటు ఇతర ట్రాక్టర్స్, డీసీఎం తదితర వాహనాల ద్వారా తక్షణమే తరలించారు,జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్, ప్రత్యేక శ్రద్ధ వహించి చెక్పోస్టులు ఏర్పాటు చేసి ప్రతి చెక్ పోస్ట్ దగ్గర పోలీస్ అధికారి జిల్లా యంత్రాంగం తరపున ఒక అధికారిని నియమించి వచ్చే వాహనాలను మళ్లించి పూర్తిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో మక్కజొన్నలను తరలించడం కోసం క్షేత్రస్థాయిలో ప్రతి ఇన్స్పెక్టర్, ఎస్సై స్థాయి అధికారులను నియమించారు. ప్రతినిత్యం వైర్లెస్ సెట్ ద్వారా పరిస్థితిని సమక్షిస్తూ వాహనాల లోడింగ్ అన్ లోడింగ్ విషయంలో ప్రత్యేకంగా హమాలీలను అధికంగా నియమించుకొని ముందుకు సాగారు,గత రెండు రోజుల్లో నుండి క్షేత్రస్థాయిలో కలెక్టర్ ఎస్పీ పోలీస్, జిల్లా ఉన్నతాధికారులు ప్రతీ ఒక్కరూ నిబద్ధతతో పనిచేసే జిల్లా మక్కల లక్ష్యం పూర్తి చేయుటకు చర్యలు తీసుకుంది. అదనపు కలెక్టర్ రెవెన్యూ, ప్రతినిత్యం సంబంధిత సెంటర్ అధికారులు మార్క్ఫెడ్, రవాణా శాఖ అధికారులతో మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కలెక్టర్ సూచనల ప్రకారం ప్రణాళికలను అమలు చేస్తున్నారు.

# డాగ్ స్క్వాడ్ సిబ్బందితో మాదక ద్రవ్యాలను గుర్తించేందుకు విస్తృత తనిఖీలు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి; మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, టౌన్ డీఎస్పీ తిరుపతి రావు పర్యవేక్షణలో మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు విస్తృత తనిఖీలు నిర్వహించారు.మాదక ద్రవ్యాలను గుర్తించేందుకు ప్రత్యేక శిక్షణ పొందిన జగిలంతో కూడిన జిల్లా డాగ్ స్క్వాడ్ సిబ్బంది సహకారంతో టౌన్ పోలీసులు పత్తిపాక రోడ్డులోని క్రాంతి ట్రాన్స్‌పోర్ట్, నవత ట్రాన్స్‌పోర్ట్, ఎస్ఆర్ఎంటీ ట్రాన్స్‌పోర్ట్, ఆర్టీసీ బస్ స్టాండ్ పార్సిల్ కార్యాలయం, ఎన్‌టీఆర్ స్టేడియం రోడ్డులో ఉన్న అమెజాన్, డెలివరీ నౌ, ఫ్లిప్‌కార్ట్ పార్సిల్ కార్యాలయాలలో టౌన్ ఎస్.ఐ రామ్ చరణ్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు చేపట్టారు.అనుమానాస్పద పార్సిళ్లు, సరుకులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ మాదక ద్రవ్యాల రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఐపీఎస్ పేర్కొన్నారు.

# రిటైర్డ్ ఉద్యోగస్తుల డబ్బులను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి

*** సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి డిమాండ్.**




మహబూబాబాద్,ప్రజాస్ఫూర్తి; మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రిటైర్డ్ ఉద్యోగస్తుల బెనిఫిట్స్ తక్షణ చెల్లించాలని ధర్నా నిర్వహించి సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ రిటైర్డ్ అయిన ఉద్యోగస్తులకు రావాల్సిన డబ్బులు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని జిల్లాలో 450 మంది రిటైర్డ్ ఉద్యోగస్తులు రిటైర్డ్ అయ్యి రెండేళ్లయినా కూడా బెనిఫిట్స్ రాక రాష్ట్రంలో 26 మంది పెన్షనర్లు మృతి చెందడం జరిగిందన్నారు. రెండేళ్లుగా ఇవ్వవలసిన 16 వేల కోట్ల రూపాయలు ఇవ్వకుండా కాలయాపన చేయడం ఎంతవరకు సరైనదో ఆలోచించాలిన్నారు. ఒక్కొక్క రిటైర్ అయినటువంటి వాళ్ళకు 40 నుంచి 60 లక్షల రూపాయలు రావాల్సి ఉన్న డబ్బులు రాక వారి బతుకులు ఆగమవడమే కాకుండా ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. సుదీర్ఘకాలంగా పనిచేసిన దాచుకున్న డబ్బులు కూడా అవసరాలకు రాకపోవడంతో ప్రతి రిటైర్డ్ ఉద్యోగులో ఆ బాధ కనిపిస్తుంది అన్నారు. జిపిఎఫ్,లీవ్ ఎన్ క్యాష్మెంట్, కమ్యూటేషన్ బకాయిలు పెండింగ్ లేకుండా తక్షణమే 100 రోజుల ప్రణాళికలో భాగంగా ముఖ్యమంత్రి మాట ఇచ్చిన ప్రకారంగా తక్షణమే రిటైర్డ్ ఉద్యోగాలు డబ్బులను చెల్లించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉద్యోగులు అందరికి కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా రిటైర్డ్ ఉద్యోగుల ప్రతినిధులు వచ్చి రిటైర్డ్ ఉద్యోగస్తుల కోసం పోరాటం చేస్తున్నందుకు సిపిఐ పార్టీ వారికి ధన్యవాదాలు చెప్పినవారు. మైస నాగయ్య, గుడిశాల పాపయ్య, విజయ్ కుమార్ ,వెంకటయ్య ఈ కార్యక్రమంలో 18వ వార్డు కౌన్సిలర్ రెశెపల్లి నవీన్,చింతకుంట్ల వెంకన్న, నర్రా శ్రావణ,వెలుగు శ్రావణ,లింగ్యా నాయక,వంకాయలపాటి చిరంజీవి, జలగం ప్రవీణ్, కేదాశ రమేష్,మంద శంకర్, తండా శ్రీనాథ్,మేక వీరన్న, రవిచంద్రబోస్, కురాకుల పాల్, గాదం శ్యాం ప్రసాద్, అల్లివేణు,మంద రవి, మల్లయ్య, వెంకటేశ్వర్లు. ఉస్మాన్, రఫీ, లక్ష్మీ, నరసమ్మ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు నీటి ఎద్దడి కలగకుండా పకడ్బందీ చర్యలు

**- అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ ప్రజలకు నీటి ఎద్దడి కలవకుండా పగడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కర్ రావు అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కర్ రావు అధ్యక్షతన శుక్రవారం అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల నేపథ్యంలో జరిగిన ఈ సమావేశంలో స్థానిక ఆర్డిఓ శేఖర్ రెడ్డి తో కలిసి వార్డుల వారీగా తాగునీటి సమస్యలపై కౌన్సిలర్లతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ప్రజలకు ఎటువంటి తాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ యంత్రాంగంపై ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వార్డులలో సమానంగా నీటి సరఫరా జరిగేలా చూడాలని చైర్‌పర్సన్‌కు సూచించారు. నీటి ఎద్దడి తలెత్తకుండా కమిషనర్, ఏఈ మరియు క్షేత్రస్థాయిలోని వాటర్ మెన్లతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

*** అవసరమైతే ప్రైవేట్ బోర్ల లీజు, అదనపు ట్యాంకర్ల ఏర్పాటు: చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్**

అవసరమైతే ప్రైవేటు బోర్లు లీజుకు తీసుకుంటామని, అదనపు ట్యాంకర్లు ఏర్పాటు చేస్తామని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ పట్టణంలో నీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఇప్పటికే అన్ని వార్డుల్లో సమృద్ధిగా నీరు ఉన్న బోర్లను గుర్తించామని తెలిపారు. అవసరమైన చోట ప్రైవేట్ బోర్లను లీజుకు తీసుకోవడం జరిగిందని, అదనంగా మరో 6 నీటి ట్యాంకర్లను కూడా లీజుకు తీసుకుని ప్రజలకు నీటి ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ ఎన్ వెంకటేశ్వర్ నాయక్ మాట్లాడుతూ అదనపు కలెక్టర్ గారి ఆదేశానుసారం ప్రజా ప్రతినిధుల సూచనలు సలహాలు తీసుకుంటూ ప్రజలకు నీటి కొరత లేకుండా మా టెక్నికల్ టీం, వాటర్ మెన్ లతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, అందరూ వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఆర్ఓ అంజయ్య, ఏఈ నితీష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ రఘుపతి, టీడబ్ల్యూఐ సంతోష్ కుమార్, వాటర్ మెన్లు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇసుక అవసరం ఉన్న వారు దళారులను ఆశ్రయించవద్దు

*** శాండ్ బజార్ సద్వినియోగం చేసుకోండి**



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: కూసుమంచి మండలకేంద్రంలో నిర్వహించబడుతున్న శాండ్ బజార్ ను ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, ఇసుక అవసరం భవన నిర్మాణాలు,సీసీ రోడ్ల నిర్మాణం,ఉన్న ఎవరైనా సద్వినియోగం చేసుకోవా లని తహసీల్దార్ డీ. సైదులు సూచించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ...ఇసుక అవసరం ఉన్న వారు దళారులను ఆశ్రయించ వద్దని, ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రజల అవసరాలను గమనంలో ఉంచుకుని మండలకేంద్రంలో డంప్ యార్డ్ ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇండ్ల నిర్మాణం చేపట్టే వారు నేరుగా కార్యాలయంలో సంప్రదిస్తే మైనింగ్ శాఖనుంచి కావాల్సిన ఇసుక దిగుమతి చేసుకుని అవసరం ఉన్నవారికి సరఫరా చేస్తామని తెలిపారు. బయట కొనుగోలు చేసి వేలకు వేలు నష్టపోవద్దని సూచించారు. ఇసుక ఇక డంపింగ్ యార్డ్ కు రాదని, యార్డ్ ఎత్తివేశారని వచ్చే వదంతులు నమ్మి, దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని కోరారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తక్కువ ధరకే ఇసుక అందిస్తుందని సూచించారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యా వారోత్సవాలు ఘనంగా నిర్వహణ




కూసుమంచి ప్రజా స్ఫూర్తి: ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల, కూసుమంచిలో విద్యా వారోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని వివిధ గ్రామపంచాయతీల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సమావేశాన్ని ఉద్దేశించి కూసుమంచి గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీమతి కొండ కృష్ణవేణి మాట్లాడుతూ, మండల పరిధిలోని 41 గ్రామపంచాయతీల సర్పంచులందరూ పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు పొందేలా చైతన్యం కల్పించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విద్యాశాఖపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రభుత్వ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. అలాగే ప్రభుత్వం త్వరలో విద్యార్థుల కోసం ఉదయం అల్పాహారం మరియు మధ్యాహ్న భోజన పథకాలను ప్రవేశపెట్టబోతుందని పేర్కొన్నారు.ఈ అవకాశాలను వినియోగించుకుని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని కళాశాల ప్రతిష్టను మరింత పెంచాలని సూచించారు. గురువాయిగూడెం సర్పంచ్ శ్రీ బానోతు బిక్షం మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు అందుబాటులో లేని సమయంలో విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లి ప్రైవేట్ కళాశాలల్లో అధిక ఖర్చుతో చదవాల్సి వచ్చేదని గుర్తుచేశారు. ప్రస్తుతం కూసుమంచి మండలంలోనే ప్రభుత్వ కళాశాల అందుబాటులో ఉండటం విద్యార్థులకు గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, పోటీ పరీక్షలకు అవసరమైన సమగ్ర శిక్షణను కూడా పొందుతారని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ బి. వీరభద్రరావు మాట్లాడుతూ, స్వాతంత్ర్యం అనంతరం ఎన్నో సంవత్సరాల పాటు ఈ ప్రాంతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు ఉన్నత విద్యకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆడపిల్లల విద్యకు తీవ్ర ఆటంకాలు ఎదురయ్యేవని తెలిపారు. 2024 సంవత్సరంలో మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కృషితో కూసుమంచి మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు కావడం ఈ ప్రాంత ప్రజలకు ఒక గొప్ప వరమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తోందని, తాను ప్రిన్సిపాల్‌గా విద్యార్థుల ఉన్నతికి అహర్నిశలు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా 2026 విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరం మరియు ద్వితీయ సంవత్సరంలో టాపర్లుగా నిలిచిన విద్యార్థినీ విద్యార్థులకు షీల్డ్‌లు మరియు బహుమతులు అందజేసి సత్కరించారు. వివిధ గ్రామాల నుంచి హాజరైన సర్పంచులు విద్య ప్రాధాన్యతపై ప్రసంగించి విద్యార్థులను ప్రోత్సహించారు. గుండా దామోదర్ రెడ్డి కూడా సభను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని వివరించారు.ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపుతూ, ప్రభుత్వ విద్యపై ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పెంపొందించేలా విజయవంతంగా ముగిసింది.



# బార్లీ నీటితో ప్రయోజనాలెన్నో

ఎండలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. వేడిమి తాపంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తుంటాయి. వేసవి వేడిని తగ్గించడానికి, ఆరోగ్య సమస్యలకు చెక్ పెట్టడానికి బార్లీ వాటర్ ఎంతగానో ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. బార్లీ నీరు వల్ల చాలా ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది కొలెస్ట్రాల్ తగ్గించడంలో సాయపడుతుంది. గట్ బాక్టీరియాను సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది. మన ఆరోగ్యంలో గట్ బ్యాక్టీరియా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. బార్లీ ఆధారిత ఆహారాన్ని తీసుకోవడం వల్ల బాక్టీరాయిడ్స్ అనే గట్ బ్యాక్టీరియా తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. శరీర వేడిని తగ్గించి తక్షణ శక్తిని అందించే గుణాలు బార్లీ వాటర్‌లో మెండుగా ఉంటాయి. బార్లీలో ఫైబర్, క్యాల్షియం, ఐరన్, మాంగనీస్, మెగ్నీషియం, జింక్, కాపర్, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు తగినతంగా కలిగి ఉంటాయి. సమ్మర్ లో బార్లీ వాటర్ తాగితే ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉ




### అజీర్తిని దూరం చేస్తుంది

బార్లీ వాటర్ రక్తపోటును అదుపులో ఉంచుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచి.. టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. మధుమేహం ఉన్నవారు తమ రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించేందుకు బార్లీ వాటర్ తాగొచ్చు. ఎండల ప్రభావం పడకుండా ఉండాలన్న, వడదెబ్బ తగలకుండా ఉండాలన్న ఈ నీళ్లు తాగాల్సిందే. బార్లీ నీళ్లు తాగితే జీర్ణాశయం కూడా చాలా శుభ్రపడుతుంది. అజీర్తి దూరమవుతుంది. పిల్లలకు బార్లీ నీళ్లు తాగిస్తే మంచి ఫలితం ఉంటుంది. మలబద్ధకం వంటి సమస్యలు దరి చేరవు. గర్భిణులు రోజు బార్లీనీళ్లు తాగితే మరీ మంచిది. కాళ్ల వాపు సమస్య వారి దరిచేరదు. రోజులో ఉదయం, సాయంత్రం బార్లీ నీళ్లు తాగితే బిడ్డ ఆరోగ్యం కూడా బాగుంటుంది. అలసట కూడా త్వరగా రాదు. బరువు తగ్గాలనుకునే వారికి కూడా బార్లీ నీళ్లు బాగా ఉపయోగపడతాయి. రక్తంలో కొలెస్ట్రాల్ శాతాన్ని తగ్గిస్తాయి. దీని ద్వారా గుండె సంబంధిత వ్యాధులు దూరంగా ఉంటాయి. మహిళలను తరచూ బాధించే ప్రధాన సమస్య మూత్రనాళ ఇన్ఫెక్షన్. ఈ సమస్యను దూరం చేసుకోవాలంటే ప్రతి రోజు ఉదయాన్నే గ్లాసు బార్లీ నీళ్లు తాగితే మంచి ఫలితం ఉంటుంది. మూత్రంలో ఇన్ఫెక్షన్లు కలిగే కారకాలు, వ్యర్థాలు బయటికి పోతాయి. చిన్న చిన్న రాళ్లు కూడా కరిగిపోతాయి.

### కొలెస్ట్రాల్ తగ్గిస్తుంది

బార్లీ వాటర్ లేదా బార్లీ టీ తాగడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. బార్లీలో ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్‌ను అణచివేసి, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే రసాయనాలను టోకాల్స్ అని పిలుస్తారు. బార్లీ నీరు గుండె జబ్బుల సంభవాన్ని తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. ఎందుకంటే పానీయంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు గుండెపై ఆక్సీకరణ ఒత్తిడితో పోరాడుతాయి. పానీయం గుండె జబ్బులు మరియు అధిక కొలెస్ట్రాల్ రెండింటినీ సమర్థవంతంగా పోరాడటానికి సహాయపడుతుంది.



### రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది

బార్లీ నీరు రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుందని రుజువు చేసే వివిధ పరీక్షలు ఉన్నాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులు శరీరంలో బ్లడ్ షుగర్ స్పైక్‌ను నియంత్రించడానికి తీపి లేని బార్లీ నీటిని క్రమం తప్పకుండా తాగాలి. బార్లీ నీరు మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రయోజనం చేకూరుస్తుంది, ముఖ్యంగా రక్తంలో చక్కెరను నిర్వహించడం ద్వారా మరియు పరిస్థితి వల్ల వచ్చే మరిన్ని వ్యాధులను నివారించడం. పానీయంలోని యాంటీ ఆక్సిడెంట్లు ఒక వ్యక్తిలో ప్రీ డయాబెటిస్‌ను రివర్స్ చేయడానికి కూడా సహాయపడతాయి. అయితే, పానీయంలో చక్కెర లేదా స్వీటెనర్లు లేవని నిర్ధారించుకోవాలి.



## జిమ్‌కు వెళ్తున్నారా..?
# ఈ విషయాలు తెలుకోండి

ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతీ ఒక్కరు ప్రయత్నిస్తుంటారు. ఇందులో భాగంగానే చాలా మంది ఉదయాన్నే జాగింగ్ , యోగాలు, జిమ్‌లకు వెళ్తున్నారు. డైలీ లైఫ్‌లో ఇది ఒక భాగంగా మారింది. కానీ ముఖ్యంగా సమ్మర్‌లో కొన్ని జాగ్రత్తలు తప్పకుండా పాటించాలి. చాలా మంది యువత ఉదయాన్నే జిమ్‌లకు వెళ్తారు. ఉదయం లేవగానే కొందరు బనానా తిని జిమ్‌కు వెళ్తారు. ఇది ఎంతో ప్రమాదకరం. ఇలా అస్సలు చేయకూడదు. అరటి తొందరగా జీర్ణం కాదు. అందుకు కేవలం పరగడుపున నీళ్లు తాగి జిమ్‌కు వెళ్లాలి. జిమ్‌లో కోచ్ చెప్పినట్లు విధంగా వర్కవుట్ చేయాలి.



కొందరు అతిగా వర్కవుట్లు చేస్తుంటారు. ఇలా చేయడం వల్ల కూడా అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. శరీరానికి అవసరమైన పోషకాలు, విటమిన్లు ఉండే ఫుడ్‌ను తీసుకోవాలి. జిమ్ తర్వాత గుడ్లు, బనానాలు తినవచ్చు. కానీ కొందరు ఓవర్ నైట్‌లో మంచి స్ట్రక్చర్ రావాలనుకుంటారు. దీనికోసం మాత్రలను వాడుతారు. ఇలాంటివి వాడటం వల్ల లేని ప్రమాదం కలుగుతుంది. జిమ్‌లలో కోచ్ చెప్పిన విధంగానే ఫుడ్ హ్యాబిట్లు అలవాటు చేసుకోవాలి. స్టేప్ బై స్టేప్ బరువులను పెంచుకుంటూ వర్కవుట్లు చేయాలి. కానీ కొందరు మాత్రం.. ప్రారంభించిన రోజునే భారీగా బరువులు ఎత్తుతుంటారు. దీని వల్ల కండరాలు పట్టేసుకుంటాయి. జిమ్ చేసేటప్పుడు లేదా జాగింగ్ చేసేటప్పుడు మధ్యలో గ్యాప్ ఇవ్వాలి.



గొంతు తడారి పోకుండా కొన్ని నీళ్లను తాగుతుండాలి. ఎక్కువగా బరువులు ఎత్తకుండా చూసుకోవాలి. కొందరికి బీపీ, డయాబెటిక్ సమస్యలు ఎక్కువగా ఉంటాయి. అలాంటి వారు ఎక్కువగా డాక్టర్ల సూచనల మేరకు మాత్రమే జిమ్‌లో వర్కవుట్లు చేయాలి. ముఖ్యంగా జిమ్‌లు, జాగింగ్‌లు చేసే వారు.. పెసర్లు, శనగలు, గుడ్లు, అరటి పండ్లు, పాలు, నాన్ వెజ్ ఎక్కువగా తీసుకోవాలి. రాత్రిపూట బాగా తినాలి. అదే విధంగా జిమ్‌లో గంటలు గంటలు వర్కవుట్స్ చేయకూడదు. ఇలా చేస్తే గుండె జబ్బులు, హెల్త్ ప్రాబ్లమ్స్ వచ్చే సూచనలున్నాయి.

# క్రూడ్ దెబ్బ, రూపాయి పతనం

**నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు**

**ముడి చమురు ధరల పెరుగుదలతో నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు**

**డాలర్‌తో పోలిస్తే రికార్డు కనిష్ఠానికి పడిపోయిన రూపాయి విలువ**

**సెన్సెక్స్ 160 పాయింట్లు, నిఫ్టీ 46 పాయింట్ల నష్టం**

**మెటల్, రియల్టీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి**

**ఐటీ, మీడియా రంగాలకు మాత్రం కొనుగోళ్ల మద్దతు**



**ముంబై:** భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. రూపాయి విలువ అత్యంత కనిష్టానికి పతనమవడం, క్రూడాయిల్ ధరలు పెరగడం మార్కెట్లపై దుష్ప్రభావం చూపింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 160.73 పాయింట్లు (0.21 శాతం) నష్టపోయి 75,237.99 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ50 కూడా 46.10 పాయింట్లు (0.19 శాతం) నష్టపోయి 23,643.50 వద్ద ముగిసింది.

రూపాయి విలువ తగ్గడం, చమురు ధరలు పెరుగుదల, ద్రవ్యోల్బణం పెరుగుతుందనే భయం వంటివి ఇన్వెస్టర్లపై ప్రభావం చూపాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు ఇంకా కొనసాగడం, హార్ముజ్ జలసంధి పూర్తి స్థాయిలో తెరుచుకోకపోవడం వంటివి కూడా ఇందుకు కారణాలు. ఈ కారణాలతో చమురు ధరలు పెరుగుతున్నాయి. అంతర్జాతీయంగా బ్యారెల్ క్రూడాయిల్ ధర 109 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. మరోవైపు భారతీయ రూపాయి అత్యంత కనిష్ట స్థాయికి చేరింది. డాలర్‌తో రూపాయి విలువ 96.05 వద్ద ట్రేడవుతోంది. అంతకుముందు ఇది 95.9575 వద్ద కొనసాగింది. రూపాయి అత్యంత తక్కువ స్థాయికి చేరుకోవడం కూడా మార్కెట్లపై ప్రభావం చూపింది.

రూపాయి ఇంత తక్కువ స్థాయికి పడిపోవడం ఇదే మొదటిసారి. ఈ రోజు 0.3 శాతం తగ్గింది. చమరు ధరల పెరుగుదల, విదేశీ ద్రవ్యం అధికం కావడం, పశ్చిమాసియాలో అస్థిరత వంటివి రూపాయి పతనానికి కారణాలు. ఇండియా చమురు దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడుతున్న సంగతి తెలిసిందే. అలాగే, అమెరికా వడ్డీ రేట్లు, మారక నిల్వలు తగ్గడం కూడా కారణాలుగా చెప్పుకోవచ్చు.

# జీమెయిల్ ఉచిత స్టోరేజ్‌లో కొత్త మెలిక..

**స్పందించిన గూగుల్!**


**కొత్త జీమెయిల్ ఖాతాలకు 5జీబీ స్టోరేజ్ మాత్రమే!**

**15జీబీ పూర్తి స్టోరేజ్ కోసం ఫోన్ నంబర్ తప్పనిసరి!**

**ఇది కేవలం ఓ ప్రయోగం మాత్రమేనని స్పష్టం చేసిన గూగుల్**

**ఖాతా భద్రత మెరుగుపరచడమే లక్ష్యమని వెల్లడి**

**ప్రస్తుత ఖాతాలపై ఎలాంటి ప్రభావం ఉండదని అంచనా**




**న్యూఢిల్లీ:** ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్ తన జీమెయిల్ సేవల్లో కీలక మార్పును పరీక్షిస్తోంది. కొత్తగా జీమెయిల్ ఖాతా తెరిచే వారికి ఇప్పటివరకు ఉచితంగా అందిస్తున్న 15జీబీ స్టోరేజ్ స్థానంలో కేవలం 5జీబీ మాత్రమే ఇవ్వాలని యోచిస్తోంది. పూర్తి 15జీబీ స్టోరేజ్ పొందాలంటే తమ ఫోన్ నంబర్‌ను ఖాతాకు జోడించాలనే షరతు విధిస్తోంది.

ఈ విషయంపై పెద్ద ఎత్తున చర్చ జరగడంతో గూగుల్ స్పందించింది. "ఎంపిక చేసిన కొన్ని ప్రాంతాల్లో కొత్త ఖాతాల కోసం ఈ కొత్త స్టోరేజ్ విధానాన్ని పరీక్షిస్తున్నాం. మా యూజర్లకు నాణ్యమైన సేవలను అందించడంతో పాటు, ఖాతా భద్రతను, డేటా రికవరీని మెరుగుపరచడమే దీని ఉద్దేశం" అని గూగుల్ ప్రతినిధి తెలిపారు. ఫోన్ నంబర్‌ను జోడించడం ద్వారా ఖాతా భద్రతను పెంచాలని వినియోగదారులను ప్రోత్సహించడమే తమ లక్ష్యమని సంస్థ పేర్కొంది. ఈ మార్పును మొదట ఓ రెడ్డిట్ యూజర్ గుర్తించారు. కొత్తగా జీమెయిల్ ఖాతా తెరిచినప్పుడు తనకు 5జీబీ మాత్రమే వచ్చినట్లు, ఫోన్ నంబర్ జోడిస్తే 15జీబీకి అప్‌గ్రేడ్ చేసుకోవచ్చని చూపిస్తున్న స్క్రీన్‌షాట్‌ను ఆయన షేర్ చేశారు. దీంతో యూజర్ల మధ్య చర్చ మొదలైంది. ప్రస్తుతానికి ఇది ప్రపంచవ్యాప్త మార్పు కాదని, కేవలం కొన్ని ప్రాంతాల్లో జరుగుతున్న ప్రయోగాత్మక పరిశీలన అని తెలుస్తోంది. గూగుల్ సపోర్ట్ పేజీల్లో ఇప్పటికీ ప్రతి ఖాతాకు 15జీబీ ఉచిత స్టోరేజ్ లభిస్తుందని పేర్కొంది. కాబట్టి, ఇప్పటికే జీమెయిల్ ఖాతాలు ఉన్నవారికి ఎలాంటి ఆందోళన అవసరం లేదని, వారి 15జీబీ స్టోరేజ్‌కు ప్రస్తుతానికి ఎలాంటి ఢోకా లేదని నిపుణులు భావిస్తున్నారు.

# లక్ష కోట్ల నష్టాలు.. అంతర్జాతీయ ఒత్తిళ్లు..

**ఇంధన ధరల పెంపు వెనుక అసలు కథ ఇదే!**

**దేశవ్యాప్తంగా లీటర్ పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున పెంపు**

**ఇరాన్ సంక్షోభంతో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 114 డాలర్లకు చేరడమే ప్రధాన కారణం**

**రికార్డు స్థాయికి పతనమైన రూపాయి విలువ ఇంధన దిగుమతులపై తీవ్ర ప్రభావం**

**10 వారాల్లో రూ.లక్ష కోట్లకు పైగా నష్టాలు చవిచూసిన చమురు సంస్థలు**

**ఇప్పటికే ఎక్సైజ్ సుంకం తగ్గించడంతో ప్రభుత్వానికి తగ్గిన ఆదాయం**




**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చింది. దాదాపు 10 వారాల పాటు స్థిరంగా ఉన్న పెట్రోల్, డీజిల్ ధరలను నేడు ఒక్కసారిగా పెంచింది. లీటర్ పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ పెంపుతో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందని తెలిసినా, మోదీ ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. అసలు ఈ పెంపునకు దారితీసిన బలమైన కారణాలేమిటో వివరంగా పరిశీలిద్దాం.

అంతర్జాతీయంగా పెరిగిన ముడి చమురు ధరలు

ఇరాన్‌లో కొనసాగుతున్న సంక్షోభం ప్రపంచ ముడి చమురు సరఫరా వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసింది. చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతల కారణంగా నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సరఫరాకు ఆటంకం కలుగుతుందనే భయంతో అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు అనూహ్యంగా పెరిగాయి. ఈ సంక్షోభానికి ముందు భారత క్రూడ్ బాస్కెట్ ధర బ్యారెల్‌కు సుమారు 69 డాలర్లు ఉండగా, ఆ తర్వాత అది 113-114 డాలర్లకు చేరింది.

# మార్ష్ తుఫాన్ ఇన్నింగ్స్..

**చెన్నైపై లక్నో ప్రతీకార విజయం..!**




**లక్నో:** ప్లే ఆఫ్స్ రేసులో నిలిచిన జట్లకు పోటీలో లేని జట్లు షాక్‌లు ఇస్తున్నాయి. పంజాబ్ కింగ్స్‌కు ధర్మశాలలో ముంబై ఇండియన్స్ ఝలక్ ఇవ్వగా.. విజయంతో ముందంజ వేయాలనుకున్న చెన్నై సూపర్ కింగ్స్‌ను లక్నో సూపర్ జెయింట్స్ ఓడించింది. ఆకాశ్ సింగ్(3-26) విజృంభణతో 187కు సీఎస్కే పరిమితమవ్వగా.. ఛేదనలో మిచెల్ మార్ష్(90) తుఫాన్ ఇన్నింగ్స్‌తో లక్నోను గెలుపు దిశగా నడిపాడు. వెంటవెంటనే మూడు వికెట్లు పడినా.. ముకుల్ చౌదరీ(13 నాటౌట్), నికోలస్ పూరన్(32 నాటౌట్)లు ప్రత్యర్థికి అవకాశమివ్వలేదు. కంబోజ్ ఓవర్లో పూరన్ నాలుగు సిక్సర్లతో లక్నో ప్రతీకార విక్టరీ సాధించగా... చెన్నై ఐదో స్థానం వద్దే ఆగిపోయింది.

పంతొమ్మిదో సీజన్‌లో ప్లే ఆఫ్స్ సమీకరణాలు ఆసక్తి రేపుతున్నాయి. జోరు మీదున్న జట్లు ముందంజ వేస్తాయనుకుంటే అనూహ్యంగా కంగుతింటున్నాయి. శుక్రవారం లక్నో సూపర్ జెయింట్స్ చేతిలో చెన్నై సూపర్ కింగ్స్ చిత్తుగా ఓడింది. విజయంతో నాలుగో స్థానానికి ఎగబాకాలనుకున్న సీఎస్కే ఆశలకు లక్నో చెక్ పెట్టింది. 188 పరుగుల ఛేదనలో లక్నో ఓపెనర్లు దంచికొట్టారు. మిచెల్ మార్ష్(90), ఇంప్యాక్ట్ సబ్ జోష్ ఇంగ్లిస్(36)లు పోటాపోటీగా ఆడారు. చెన్నై ప్రధాన పేసర్ అన్షుల్ కంబోజ్‌ను ఉతికేసిన మార్ష్ 5వ ఓవర్లో నాలుగు సిక్సర్లు, ఫోర్‌తో 28 రన్స్ పిండుకున్నాడు. మార్ష్ 28 బంతుల్లోనే అర్ధ శతకం సాధించగా పవర్ ప్లేలోనే లక్నో స్కోర్ 80 దాటింది. వీరబాదుడుతో లక్ష్యాన్ని కరిగిస్తున్న ఈ జోడీని ముకేశ్ చౌదరీ విడదీశాడు. ఇంగ్లిస్‌ను ఔట్ చేయడంతో 135 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ వెంటనే మార్ష్ రనౌటవ్వగా.. అబ్దుల్ సమద్(7)ను బౌల్డ్ చేసిన స్పెన్సర్ సీఎస్కే శిబిరంలో ఆశలు రేపాడు. టపటపా మూడు వికెట్లు పడంతో లక్నో స్కోర్ వేగానికి బ్రేకులు పడ్డాయి. అప్పటికే అవసరమైన పరుగులు తక్కువే కావడంతో ముకుల్ చౌదరీ(13 నాటౌట్), నికోలస్ పూరన్(32 నాటౌట్)లు దంచేశారు. కంబోజ్ వేసిన 17వ ఓవర్లో తొలి నాలుగు బంతుల్ని స్టాండ్స్‌లోకి పంపిన పూరన్ లక్నోకు 7 వికెట్ల విజయాన్ని అందించాడు.

**కార్తిక్ హాఫ్ సెంచరీ**

ప్లే ఆఫ్స్ రేసులో నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ భారీ స్కోర్‌తో లక్నో సూపర్ జయింట్స్‌కు సవాల్ విసిరింది. ఆకాశ్ సింగ్(3-26) ధాటికి టాపార్డర్ విఫలమైనా కుర్రాడు కార్తిక్ శర్మ(71) మెరుపు అర్ధ శతకంతో లక్నో బౌలర్లను బెంబేలెత్తించాడు. ప్రధాన ఆటగాళ్లు ఔటైనా ఒత్తిడిలోనూ గొప్ప ఇన్నింగ్స్ ఆడిన కార్తిక్ భారీ స్కోర్‌కు బాటలు వేశాడు. ఆఖర్లో శివం దూబే(32 నాటౌట్) ధనాధన్ ఆడడంతో స్కోర్ 180 దాటింది. ప్రిన్స్ యాదవ్‌ను ఉతికేస్తూ 6, 4, ,4, 6తో దూబే రెచ్చిపోగా సీఎస్కే నిర్ణీత ఓవర్లలో వికెట్ల నష్టానికి రన్స్ చేసింది.

# చెన్నై గూటికి కుల్దీప్.. ఆర్సీబీ స్క్వాడ్‌లో ఇంగ్లండ్ పేసర్..!




**న్యూఢిల్లీ:** పంతొమ్మిదో సీజన్ ప్లే ఆఫ్స్ పోటీ ఆసక్తికరంగా మారిన వేళ కొత్త వాళ్లతో స్క్వాడ్‌ను పటిష్టం చేసుకుంటున్నాయి ఫ్రాంచైజీలు. గాయంతో టోర్నీకి దూరమైన వారి స్థానాన్ని భర్తీ చేస్తున్నాయి. తాజాగా ఓవర్టన్ ప్లేస్‌లో దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ డియాన్ ఫొరెస్టర్‌ను తీసుకున్న చెన్నై.. పేసర్ ఖలీల్ అహ్మద్ స్థానంలో కుల్దీప్ యాదవ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ సైతం తమ స్క్వాడ్‌లోకి ఇంగ్లండ్ పేసర్ రిచర్డ్ గ్లీసన్‌కు చోటిచ్చింది.

లీగ్ దశ ఆఖర్లో పుంజుకొని ప్లే ఆఫ్స్‌కు గట్టి పోటీదారుగా మారిన చెన్నై సూపర్ కింగ్స్ స్క్వాడ్‌లోకి కొత్త పేసర్‌ను తీసుకుంది. సీజన్ ఆరంభం మ్యాచ్‌ల్లోనే గాయపడిన సీనియర్ పేసర్ ఖలీల్ అహ్మద్ స్థానంలో కుల్దీప్ యాదవ్‌ను తీసుకుంది సీఎస్కే. రూ.30 లక్షలకు కుల్దీప్‌తో ఒప్పందం కుదిరినట్టు ఎక్స్ వేదికగా వెల్లడించింది.

గతంలో రాజస్థాన్ రాయల్స్‌కు ఆడిన కుల్దీప్ ఇప్పుడు పసుపు జెర్సీతో చెలరేగాలని ఉవ్విళ్లూరుతున్నాడు. పేసర్ జేమీ ఓవర్టన్ స్థానంలో ఈ ఏడాదే అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన దక్షిణాఫ్రికా కుర్రాడు డియాన్ ఫొరెస్టర్‌ను స్క్వాడ్‌లోకి చేర్చుకున్న విషయం తెలిసిందే.

ఆరు టీ20ల అనుభవమే

డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో దుమ్మురేపుతున్న ఆర్సీబీ సైతం స్క్వాడ్‌లోకి కొత్త పేసర్‌ను తీసుకుంది. ఫిట్‌నెస్ టెస్టులో విఫలమైన శ్రీలంక స్పీడ్‌స్టర్ నువాన్ తుషార స్థానంలో రిచర్డ్ గ్లీసన్ (ఇంగ్లండ్)ను ఎంపిక చేసింది. ఈ పొడగరి పేసర్‌కు బెంగళూరు యాజమాన్యం రూ.1.6 కోట్లు చెల్లించనుంది.

2022లో అరంగేట్రం చేసిన గ్లీసన్‌కు అంతర్జాతీయంగా ఆరు టీ20ల అనుభవమే ఉంది. కానీ, ఫ్రాంచైజీ క్రికెట్‌లో మనోడు 145 మ్యాచులాడి 170 వికెట్లు పడగొట్టాడు. గతంలో చెన్నై, ముంబై జట్లకు ఆడిన గ్లీసన్‌ను ప్లే ఆఫ్స్‌లో అస్త్రంగా ఉపయోగించుకోనుంది ఆర్సీబీ.

# పాకిస్థాన్‌కు బిగ్ షాక్..

**డబ్ల్యూటీసీలో ఏకంగా 8 పాయింట్లు కోత..!**




**ఇస్లామాబాద్:** బంగ్లాదేశ్ పర్యటనలో దారుణ ఓటమిని మరిచిపోకముందే పాకిస్థాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఢాకా టెస్టులో స్లో ఓవర్ రేటుకు పాక్ భారీ మూల్యం చెల్లించుకుంది. మ్యాచ్ ఫీజులో కోతతో పాటు ఆ జట్టు ర్యాంకింగ్‌లోనూ దిగజారింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో కీలకమైన పాయింట్లు కోల్పోయింది. ఒకటి రెండు కాదు ఏకంగా 8 పాయింట్లు కోతకు గురైంది షాన్ మసూద్ బృందం.

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27లో పాకిస్థాన్‌కు ఊహించని షాక్. బంగ్లాదేశ్ చేతిలో 104 పరుగుల తేడాతో తొలి టెస్టులో ఓటమి పాక్ ర్యాంకింగ్స్‌ను దెబ్బతీసింది. ఆ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేటు కారణంగా మ్యాచ్ ఫీజులో 40 శాతం కోల్పోయింది. నిర్ణీత సమయానికి ఎనిమిది ఓవర్లు వెనుకంజలో ఉండడంతో జరిమానా కింద డబ్ల్యూటీసీలో 8 పాయింట్ల కోత పడింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. న్యూజిలాండ్ రెండులో ఉంది. దక్షిణాఫ్రికా, శ్రీలంక, పాకిస్థాన్ వరసగా మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచాయి.

**నహీద్ విజృంభణతో..**

ఢాకా వేదికగా జరిగిన తొలి టెస్టులో పాకిస్థాన్ బ్యాటర్లను వణకిస్తూ బంగ్లాదేశ్ భారీ విజయాన్నందుకుంది. దమ్ముంటే మా ముందు 70 ఓవర్లలో 260పైగా లక్ష్యాన్ని నిర్దేశించండి అని సవాల్ విసిరిన సల్మాన్ అఘా తల పొగరను అణచివేస్తూ సిరీస్‌లో ఆధిక్యంలోకి వెళ్లింది.

మొదటి ఇన్నింగ్స్‌లో కాస్తో కూస్తో పోరాడిన పాక్.. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం కుప్పకూలింది. నహిద్ రాణా(5-40) బంతితో చెలరేగిన వేళ బంగ్లా 104 పరుగుల తేడాతో గెలుపొందింది. తద్వారా స్వదేశంలో పాక్‌పై బంగ్లాదేశ్ మొదటి విజయంతో చరిత్ర సృష్టించింది. ఇరుజట్ల మధ్య మే 16 నుంచి రెండో టెస్టు జరుగనుంది.

# వన్డే ప్రపంచకప్ ఆడాలని ఉంది..

**కానీ, సెలెక్టర్లు ఏమంటారో..!**



**న్యూఢిల్లీ:** ఐపీఎల్‌లో తొమ్మిదో శతకంతో చెలరేగిన విరాట్ కోహ్లీ ఆట చూస్తుంటే మరో రెండేళ్లు అతడికి తిరుగులేదని అనిపిస్తోంది. వరసగా రెండు గోల్డెన్ డకౌట్‌ల నుంచి తేరుకొని సెంచరీతో విరుచుకుపడిన కోహ్లీ వన్డే వరల్డ్ కప్‌లో ఇలానే ఆడితే చూసి తరించాలని అభిమానులు అనుకుంటున్నారు. విరాట్ సైతం ప్రపంచకప్ ఆడాలనే ఉద్దేశంతోనే ఉన్నట్టుగా తెలుస్తోంది. ఆర్సీబీ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. 'దేశం తరఫున వరల్డ్‌కప్ ఆడడం కంటే గొప్ప విషయం ఏముంటుంది' అని కోహ్లీ నవ్వుతూ బదులిచ్చాడు.

అంతర్జాతీయ క్రికెట్‌లో టన్నుల కొద్దీ పరుగులు.. వన్డేల్లో శతకాల ఫిఫ్టీతో రికార్డులు నెలకొల్పిన విరాట్ కోహ్లీ తదుపరి లక్ష్యం? ఏంటో తెలుసా.. వన్డే ప్రపంచ కప్. ఐపీఎల్ పద్దెనిమిదో సీజన్‌తో ఆర్సీబీ కలను సాకారం చేసిన విరాట్ వచ్చే ఏడాది ప్రపంచకప్ ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. ఆస్ట్రేలియా పర్యటన, ఆపై స్వదేశంలో దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో శతకాలతో రెచ్చిపోయిన అతడు.. దేశవాళీ టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలోనూ దంచేశాడు. ఇప్పుడు ఐపీఎల్ 19లోనూ కుర్రాడిలా రెచ్చిపోతున్నాడు. అతడి ఫామ్ చూస్తుంటే వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ కప్ ఆడేలా ఉన్నాడు? అని అందరూ అనుకుంటున్నారు. ఇదే విషయంపై ఆర్సీబీ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. నాకు ప్రపంచకప్ ఆడాలనే ఉంది అని మనసులోని మాట చెప్పేశాడు.

'మైదానంలోకి దిగాక జట్టులో ఉత్సాహం నింపడం, విజయంలో భాగమవ్వడం మీదే నా దృష్టంతా ఉంటుంది. నన్ను నేను నిరూపించుకోవాలని ఆడను. నేను ఇప్పుడు ఆ పరిస్థితిలో లేను కూడా. ఎందుకంటే మ్యాచ్ సన్నద్ధత పట్ల, మైదానంలోకి దిగాక ఎలా ఆడాలి? అనే విషయాల పట్ల నేను నిజాయతీగా ఉంటాను. అందుకని తల కిందకు వంచి.. నెట్స్‌లో కష్టపడతాను. నా క్రికెట్ కెరీర్‌లో అన్నీ ఇచ్చినందుకు ఆ దేవుడికి కృతజ్ఞతలు. నాకు అవకాశం వచ్చినందుకు ఎంతో గర్వపడతాను. ఇక ఆట విషయానికొస్తే.. వన్డేల్లో 40 ఓవర్ల పాటు బౌండరీ నుంచి అవతలి బౌండరీ వరకూ పరిగెత్తమని చెప్పినా.. నేను పరుగెడుతాను. యాభై ఓవర్లకు తగ్గట్టుగా నేను సన్నద్ధమవుతా. నేను ఎదుర్కొనే ప్రతి బంతిని ఇదే నా కెరీర్లో చివరి బంతి అనుకుంటూ బ్యాటింగ్ కొనసాగిస్తా. అంతేనా.. వికెట్ల మధ్యలో చకచకా పరుగుతీస్తా. జట్టుకు అవసరమైన ప్రతిదీ చేసేందుకు నేను ఎల్లప్పుడూ సిద్ధమే. విజయ్ హజారే ట్రోఫీలో గొప్పగా ఆడాను. వరల్డ్‌కప్ గురించి అడిగితే.. నాకూ ఆడాలనే ఉంది. కానీ, అది నా ఒక్కడి నిర్ణయం సరిపోదు. జట్టుకు కూడా నా అవసరం ఉందని సెలెక్టర్లు అనుకోవాలి. అప్పుడే వరల్డ్‌కప్ ఆడగలను' అని విరాట్ పేర్కొన్నాడు.

రెండేళ్ల క్రితం టీ20, టెస్టులకు వీడ్కోలు పలికిన విరాట్.. ప్రస్తుతం అంతర్జాతీయంగా వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. 2011లో ధోనీ సారథ్యంలో వరల్డ్‌కప్ గెలిచిన జట్టులో సభ్యుడైన విరాట్.. ఇటీవల రోహిత్ శర్మ కెప్టెన్సీలో ఛాంపియన్స్ ట్రోఫీ విజయంలోనూ కీలకమయ్యాడు. అదే ఉత్సాహంతో 2027 వన్డే ప్రపంచకప్ ఆడి దేశానికి మరో ఐసీసీ ట్రోఫీ కట్టబెట్టాలని అతడు ఆశపడుతున్నాడు. అయితే.. మన సెలెక్టర్లు ఏం చేస్తారో చూడాలి.

MOVIE TIME

## మెగాఫోన్ పట్టిన
# రామ్ పోతినేని




**టాకీస్:** టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన అభిమానులకు అదిరిపోయే బర్త్ డే సర్ప్రైజ్ ఇచ్చారు. ఇన్నాళ్లూ తన నటనతో, డ్యాన్స్‌తో వెండితెరపై మ్యాజిక్ చేసిన రామ్, ఇప్పుడు సరికొత్త అవతారంలోకి మారబోతున్నారు. తన 23వ చిత్రం ద్వారా రామ్ దర్శకుడిగా పరిచయం కాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించాడు. ఈ వార్త ఇప్పుడు ఫిల్మ్ నగర్ వర్గాల్లో సంచలనంగా మారింది. ఎవరూ ఊహించని విధంగా ఒక ఉత్కంఠభరితమైన సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌తో రామ్ తన దర్శకత్వ ప్రయాణాన్ని ప్రారంభించ బోతున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రానికి 'వీర' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఖరారు చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ అత్యంత ఆసక్తికరంగా ఉంది. 'ది స్టోరీ ఆఫ్ ఏ లోన్ వోల్ఫ్' అనే ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ పోస్టర్ చూస్తుంటే, రామ్ ఒక ఇంటెన్స్ రోల్‌లో కనిపించబోతున్నారని స్పష్టమవుతోంది. ఈ సినిమా కోసం రామ్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన సొంత నిర్మాణ సంస్థ అయిన 'స్రవంతి మూవీస్' ఉండగానే, ప్రత్యేకంగా 'రాపో సినిమాటిక్స్' అనే కొత్త ప్రొడక్షన్ హౌస్‌ను ప్రారంభించారు. తన కలల ప్రాజెక్ట్‌ను రామ్ సోదరుడు కృష్ణ పోతినేని ఈ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకం గా నిర్మించనున్నారు.

## పల్లెటూరి ప్రేమకథ
# దూరదర్శని




**టాకీస్:** ప్రస్తుత కాలంలో సినిమా విజయాన్ని బడ్జెట్ నిర్ణయించడం లేదు, కేవలం కంటెంట్ మాత్రమే శాసిస్తోంది. బలమైన కథాంశంతో వస్తున్న చిన్న చిత్రాలు కూడా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను సాధిస్తూ సంచలనం సృష్టిస్తున్నాయి. సరిగ్గా అదే బాటలో, కేవలం కథనే నమ్ముకుని ఈ వారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం 'దూరదర్శిని'. టైటిల్‌తోనే సగటు ప్రేక్షకుడిలో పాత జ్ఞాపకాలను తట్టిలేపిన ఈ సినిమా, థియేటర్లలో సందడి చేస్తోంది. చిత్ర కథ మట్టపర్రు అనే పచ్చని పల్లెటూరి చుట్టూ తిరుగుతుంది. ఊరిలో కుల రాజకీయాలు, అంతరాలు ఉన్నప్పటికీ.. హరి (సువీక్షిత్), వాణి (గీతికా రతన్) చిన్నప్పటి నుండి ఒకరినొకరు ఇష్టపడతారు. ప్రతి శుక్రవారం దూరదర్శినిలో వచ్చే చిత్రలహరిని చూడటానికి వెళ్లే క్రమంలో వీరి మధ్య ప్రేమ చిగురిస్తుంది.




# హీరోలకే అంత ప్రాధాన్యత ఎందుకు..
## ఇండియన్ సినిమాపై ఆలియా భట్ కామెంట్స్ వైరల్

**టాకీస్:** బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ తాజాగా అంతర్జాతీయ వేదికైన కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. భారతీయ చిత్ర పరిశ్రమలో కొనసాగుతున్న పురుషాధిక్యత గురించి ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. కాన్స్ వేదికపై మాట్లాడిన ఆలియా భట్.. భారతీయ సినిమాల్లో చాలా కథలు ఇప్పటికీ హీరోల చుట్టూనే తిరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. దాదాపు 75 శాతం సినిమాల్లో కథ కంటే హీరోకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. "సినిమాలో హీరో ఉన్నాడా లేదా అనే దానికంటే, కథ బలంగా ఉందా అనే విషయానికే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి" అంటూ ఆమె అభిప్రాయపడ్డారు. ఆలియా చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కొందరు ఆమె ధైర్యంగా నిజం మాట్లాడిందని ప్రశంసిస్తుండగా, మరికొందరు మాత్రం తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ముఖ్యంగా హాలీవుడ్‌ను పొగిడే క్రమంలో భారతీయ సినిమాను తక్కువ చేసి మాట్లాడారంటూ నెటిజన్లు మండిపడుతున్నారు. అలాగే, ఆమె వ్యక్తిగత జీవితాన్ని కూడా ఈ వివాదంలోకి లాగుతున్నారు. ఆమె భర్త రణబీర్ కపూర్ నటించిన యానిమల్ వంటి సినిమాలు తీవ్ర పురుషాధిక్యతతో నిండిపోయి ఉన్నాయని, అలాంటి చిత్రాలపై ఆలియా ఎందుకు స్పందించలేదని ప్రశ్నిస్తున్నారు. ఇండస్ట్రీలో మార్పు కావాలని చెబుతున్నవారు ముందుగా తమ ఇంటి నుంచే ప్రారంభించాలి అంటూ కొందరు కౌంటర్లు ఇస్తున్నారు. అయితే మరోవైపు, ఆలియా చెప్పిన విషయాల్లో వాస్తవం ఉందని పలువురు సినీ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. హీరోల పారితోషికాలు, ప్రాధాన్యత, ప్రమోషన్లు అన్నీ కూడా ఇప్పటికీ హీరోలకే అనుకూలంగా ఉంటున్నాయని, హీరోయిన్లకు సరైన గుర్తింపు దక్కడం లేదని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఇది మొదటిసారి కాదు. గతంలో కూడా కృతి సనన్, కంగనా రనౌత్, తాప్సీ వంటి నటీమణులు ఇండస్ట్రీలో ఉన్న వివక్షపై బహిరంగంగా మాట్లాడారు. హీరోలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తూ, హీరోయిన్లను ద్వితీయ స్థానంలో ఉంచుతున్నారంటూ పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పుడీ నేపథ్యంలో మరోసారి ఇండియన్ సినిమాలో మార్పు ఎప్పుడు వస్తుంది? కథలే అసలు హీరోలుగా నిలిచే రోజులు ఎప్పుడు వస్తాయి? అనే ప్రశ్న సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ఎట్టకేలకు థియేటర్లలోకి కురుప్ప

**టాకీస్:** తమిళ స్టార్ హీరో సూర్య నటించిన భారీ చిత్రం 'కరుప్పు' విడుదలకు ఎట్టకేలకు అడ్డంకులు తొలగాయి. గత కొన్ని రోజులుగా ఈ సినిమా విడుదలపై నెలకొన్న అనిశ్చితి అభిమానులను, నిర్మాతలను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. అయితే అన్ని సమస్యలు సద్దుమణగడంతో సినిమా ప్రపంచవ్యాప్తంగా మే 15, శుక్రవారం థియేటర్లలో సందడి చేసింది. తెలుగులో ఈ సినిమా 'వీరభద్రుడు' పేరుతో విడుదల అవుతోంది. సినిమా విడుదల సందర్భంగా సూర్య అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డియర్ ఆల్.. మాతో ఉన్నందుకు ధన్యవాదాలు. ఈరోజు నుంచి 'కరుప్పు', 'వీరభద్రుడు' థియేటర్లలో విడుదల అవుతున్నాయి' అంటూ ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ సందేశం అభిమానుల్లో ఆనందాన్ని నింపుతోంది. మొదట ఈ చిత్రాన్ని మే 14న విడుదల చేయాలని భావించినప్పటికీ, చివరి నిమిషంలో కొన్ని కారణాలతో విడుదల వాయిదా పడింది. దీంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ప్రేక్షకులకు క్షమాపణలు తెలిపింది. కొన్ని ప్రయాణాలు కాలాన్ని మాత్రమే కాదు.. మనసును కూడా పరీక్షిస్తాయి. సినిమా కోసం ఎదురుచూసిన ప్రతి ఒక్కరికీ మేము క్షమాపణలు చెబుతున్నాం. విడుదలలో జరిగిన ఆలస్యం మమ్మల్ని కూడా బాధించింది. అయినప్పటికీ మాపై మీరు చూపించిన నమ్మకం, ప్రేమ మాకు ఎంతో బలం ఇచ్చాయి అంటూ నిర్మాణ సంస్థ భావోద్వేగ ప్రకటన విడుదల చేసింది. అలాగే 'కరుప్పు' కేవలం తమ సినిమా మాత్రమే కాదని, ప్రేక్షకులందరి కథ అని పేర్కొంది. ఎన్నో కష్టాలు, నిద్రలేని రాత్రుల తర్వాత ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని తెలిపింది. తమిళనాడు, తెలుగు రాష్ట్రాల్లో విడుదల ఆగిపోయిన సమయంలో ముంబై, పుణెలోని కొన్ని థియేటర్లలో సినిమా ప్రదర్శన జరిగినట్లు సమాచారం రావడంతో నిర్మాతలు ఆందోళన వ్యక్తం చేశారు.




# అక్షయ్ కుమార్ 'వెల్‌కమ్ టు ది జంగిల్' టీజర్ విడుదల!



**టాకీస్:** బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ కామిక్ ఎంటర్‌టైనర్ 'వెల్‌కమ్ టు ది జంగిల్' అఫీషియల్ టీజర్ నేడు విడుదలైంది. ప్రముఖ 'వెల్‌కమ్' ఫ్రాంచైజీలో వస్తున్న ఈ మూడో భాగంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉండగా, తాజాగా విడుదలైన టీజర్ ఆ అంచనాలను మరింత పెంచేసింది. దట్టమైన అడవి నేపథ్యంలో సాగే యాక్షన్, అంతులేని కామెడీ, మరియు భారీ విజువల్స్ ఈ టీజర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. బాలీవుడ్ 'ఖిలాడీ' అక్షయ్ కుమార్ తన పాత వింటేజ్ కామెడీ టైమింగ్‌తో అలరించడానికి సిద్ధమయ్యారని ఈ టీజర్ చూస్తే స్పష్టమవుతోంది.

ఈ సినిమా ప్రత్యేకత ఏమిటంటే, బాలీవుడ్‌కు చెందిన దాదాపు 30 మందికి పైగా పాపులర్ నటీనటులు ఇందులో ఒకే ఫ్రేమ్‌లో స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. ముఖ్య పాత్రల్లో అక్షయ్ కుమార్‌తో పాటు సునీల్ శెట్టి, పరేష్ రావల్, అర్షద్ వార్సి, జాకీ ష్రాఫ్, రవీనా టాండన్, లారా దత్తా, జాక్వలిన్ ఫెర్నాండెజ్, దిశా పటాని, జానీ లీవర్, రాజ్‌పాల్ యాదవ్, శ్రేయాస్ తల్పాడే, తుషార్ కపూర్ తదితరులు నటిస్తున్నారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత అక్షయ్ కుమార్ -- రవీనా టాండన్ క్రేజీ కాంబినేషన్ ఈ సినిమాతో తిరిగి రావడం విశేషం.వీశీజఱవం

భారీ బడ్జెట్ మరియు హై-లెవెల్ వీఎఫ్ఎక్స్ హంగులతో తెరకెక్కిన ఈ చిత్రానికి అహ్మద్ ఖాన్ దర్శకత్వం వహించగా, ఫిరోజ్ ఎ. నడియాద్వాలా నిర్మించారు. పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ క్రేజీ మల్టీస్టారర్ మూవీ 2026, జూన్ 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

# పర్సెంటీజీ విధానంపై 15మందితో కమిటీ
## ఫిల్మ్ ఛాంబర్ కీలక నిర్ణయం



**టాకీస్:** సింగిల్ స్క్రీన్ థియేటర్ యాజమాన్యాలు, నిర్మాతలకీ మధ్య సినిమాల ప్రదర్శనల విషయంలో వివాదం నెలకొన్న క్రమంలో ఓ అంగీకారానికి వచ్చారు. దీనిపై వాణిజ్య మండలి అధ్యక్షుడు డి.సురేశ్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం థియేటర్ యాజమాన్యాలు, నిర్మాతలు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఫిల్మ్ ఛాంబర్ కీలక నిర్ణయం తీసుకుంది. పర్సంటేజీ విధానంపై కమిటీ ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. 15 మందితో కమిటీ వేయనున్నట్లు వెల్లడించింది. ఈ కమిటీ రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. దీనిపై సి.కల్యాణ్ మాట్లాడుతూ.. రెండు నెలల్లో సమస్య పరిష్కారం అవుతుందన్నారు. సినిమాల విడుదలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టంచేశారు. కమిటీలో ఐదుగురు నిర్మాతలు, ఐదుగురు ఎగ్జిబిటర్లు, ఐదుగురు డిస్ట్రిబ్యూటర్లు ఉంటారని ఆయన తెలిపారు. శుక్రవారం జరిగిన సమావేశంలో నిర్మాతలు అల్లు అరవింద్, చదలవాడ శ్రీనివాసరావు, సుప్రియ యార్లగడ్డ, రవి కిషోర్, మైత్రీ రవి, సి.కల్యాణ్, దిల్ రాజు, రాధా మోహన్, చెరుకూరి సుధాకర్, భోగవల్లి బాపినీడు, సాహు గారపాటి, సతీష్ కిలారు, నాగవంశీ, ఎస్ కె ఎన్, రాజేష్ దండా, ధీరజ్ మొగిలినేని దాదాపు 50 మంది నిర్మాతలు పాల్గొన్నారు. ఎగ్జిబిటర్స్ తరపున విజయేందర్ రెడ్డి, శ్రీధర్ తదితరులు హాజరయ్యారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.